# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 104 పేజీలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం- 16 - ఏప్రిల్ - 2025


## వీకెండ్ రాజకీయాలు చేయొద్దు..

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు క్లాస్ పీకిన సీఎం రేవంత్ రెడ్డి

- ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు క్లాస్ పీకారు.
- మంత్రి పదవులను అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు.
- పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు.
- ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం



హైదరాబాద్ : రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తనకు మంత్రి పదవి రాకుండా జానా రెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రచ్చ చేస్తే.. పదేళ్లు పార్టీని కాపాడుకున్న మమ్మల్ని కాదని.. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు. ఇలా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు క్లాస్ పీకారు. మంత్రి పదవులను అధిష్ఠానం చూసుకుంటుందని తెలిపారు. హైదరాబాద్ శివారు శంషాబాద్ నోవాటెల్‌లో కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై

## కేసీఆర్ మంచివారు... నేను రౌడీ టైప్: ఎమ్మెల్సీ కవిత



- కామారెడ్డి జిల్లా బాన్సువాడ బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కవిత
- బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరిస్తున్నారని కొందరిపై ఆరోపణలు.. తీవ్ర హెచ్చరిక
- బెదిరింపులకు పాల్పడితే 'పింక్ బుక్'లో పేర్లు నమోదు చేస్తామని వార్నింగ్
- అధికారులు, నాయకులు ఎవరైనా వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ

## రేవంత్ సర్కార్‌పై కేంద్ర మంత్రి షాకింగ్ కామెంట్స్

రేవంత్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు.

హైదరాబాద్ అభివృద్ధి కిషన్‌రెడ్డికి ఇష్టం లేదనే మాటలు చిల్లర మాటలు అని ధ్వజమెత్తారు.

ఎవరైనా అభివృద్ధి జరగకూడదని అనుకుంటారా అని ప్రశ్నించారు.

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము గెలుస్తామనే నమ్మకం ఉందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



హైదరాబాద్: తెలంగాణలో భూముల అమ్మకాల ద్వారా పరిపాలన చేయాలని చూస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మద్యం, భూములు అమ్మడం ద్వారా నిధులు రాబట్టి పరిపాలన చేయాలని రేవంత్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఇంట్లో ఉన్న చెట్టు కొట్టాలన్న జీహెచ్‌ఎంసీలో పర్మిషన్ తీసుకోవాలని.. అలాంటి హెచ్‌సీయూలో చెట్లను ఎలా కొట్టారని ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం కన్జర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంగించిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏ రాష్ట్రంలోనూ భూములు అమ్మలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్నిక త్వరలో ఉంటుందని.. ఈ విషయంలో మీడియాకు ఎక్కువ ఆత్మృత ఉందన్నారు. తమకు , తమ పార్టీ కార్యక్రమాలు అన్ని సమగ్రంగానే జరుగుతున్నాయని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

### సౌత్‌లో బలపడుతాం..

ఏఐడీఎంకేతో గతంలో బీజేపీకి పొత్తు ఉండేదని.. ఇప్పుడు దాని పునరుద్దరణ జరిగిందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. అన్నామలైకి జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవకాశం ఇస్తారని అన్నారు. నియోజకవర్గ పునర్విభజనపై

## మరో 30 నుంచి 40 వేల ఎకరాలు కావాలి – త్వరలోనే నిర్ణయం నారాయణ



- రాజధాని అమరావతిలో మంత్రి నారాయణ పర్యటన
- రాజధాని నిర్మాణానికి అవసరమైన గ్రావెల్, మట్టి పరిశీలన
- రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ నిర్మాణం

## కుల, మత ప్రాంతాలను జగన్ రెచ్చగొడుతున్నారు

# సీఎం చంద్రబాబు ఆగ్రహం

- మంత్రివర్గ సమావేశం అనంతరం వివిధ అంశాలపై చర్చ
- ఎస్వీ గోశాల, పాస్టర్ ప్రవీణ్, వక్ఫ్ బిల్లుపై మతాలను రెచ్చగొడుతున్నారని సీఎం చంద్రబాబు మండిపాటు
- కుల, మత ప్రాంతాలను జగన్ రెచ్చకొడుతున్నాడని సీఎం మండిపడ్డారు.
- ప్రజలకు ఏది మంచో అదే నిర్ణయాన్ని మనం తీసుకుంటున్నామని వెల్లడించారు.



వివరాలు 2లో..

అమరావతి : సచివాలయంలో మంత్రివర్గ సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు మంత్రులతో తాజా రాజకీయ పరిణామాలు, వివిధ అంశాలపై చర్చించారు. కుల, మత ప్రాంతాలను జగన్ రెచ్చకొడుతున్నాడని సీఎం మండిపడ్డారు. తిరుపతి గోశాల అంశం, పాస్టర్ ప్రవీణ్ మరణం, వక్ఫ్ బోర్డు బిల్లు అంశాలతో 3 మతాలను రెచ్చకొడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ వైఖరి ఎలా ఉందో కళ్లముందు కనిపిస్తోందన్న సీఎం ఆ కుట్రలను సమర్థంగా తిప్పికొడుతూనే ప్రజల్ని చైతన్య పరచాలని మంత్రులకు చెప్పారు. అధికారుల అవినీతిపై తరచూ చర్చ జరుగుతుండటం సీఎం చంద్రబాబు కేబినెట్‌లో ప్రస్తావించారు. రాజకీయంగా అంతా బాగానే ఉన్నా అధికారుల స్థాయిలో ఈ తరహా చర్చలు సరికాదని స్పష్టం చేశారు. ఏ శాఖ పరిధిలోని మంత్రులు ఆ శాఖ అంశాలపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యూరోక్రసీలో అవినీతిపై ఈ మధ్య ఎక్కువగా చర్చకు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ తీసుకురావాలని మంత్రివర్గం నిర్ణయించింది.

## గతంలో టీటీడీ చైర్మన్ గా చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడమేంటి?:

# హోంమంత్రి అనిత

- తిరుమలపై కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్న అనిత
- మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం
- లా అండ్ ఆర్డర్ విషయంలో ఎక్కడా రాజీపడబోమని స్పష్టీకరణ
- ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టే దురుద్దేశంతో సాగుతున్న దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొడతామని ఆమె హెచ్చరించారు.



రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అటువంటి వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టే దురుద్దేశంతో సాగుతున్న దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొడతామని ఆమె హెచ్చరించారు. మంగళవారం నాడు ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా మత ఘర్షణలు సృష్టించి, లా అండ్ ఆర్డర్ సమస్యలు

## అమరావతి పునర్నిర్మాణ పనులు - మే 2న రాష్ట్రానికి మోదీ



- మే 2న అమరావతిలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటన
- అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మోదీ పర్యటన ఉంటుందన్న సీఎం
- 3 ఏళ్లలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, రహదారులు పూర్తి చేయాలన్న సీఎం వెల్లడించారు.

## ప్రభుత్వాన్ని పడగొట్టాలని కొందరు కోరుతున్నారన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే....

# స్పందించిన మంత్రి పొంగులేటి

- బీఆర్ఎస్ నేతలు అధికార దాహంతో మాట్లాడుతున్నారన్న మంత్రి
- ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే కూల్చేస్తామని మాట్లాడుతున్నారని విమర్శ
- ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూల్చుతామంటూ పగటి కలలు కంటున్నారని విమర్శ



ప్రభుత్వాన్ని పడగొట్టాలని కొందరు కోరుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధికార దాహంతో తమ ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే కూల్చివేస్తామని మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు సూచన మేరకే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారని అన్నారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూల్చుతామంటూ బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కంటున్నారని అన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి కేసీఆర్ ఆత్మ అని పొంగులేటి అన్నారు. తమ ప్రభుత్వంపై మొదటి నుంచి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

## తమిళనాడు 'స్వయంప్రతిపత్తి' కోసం కీలక కమిటీ

# స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం

తమిళనాడు స్వయంప్రతిపత్తిపై సూచనలకు కమిటీ

గవర్నర్‌తో విభేదాల వేళ తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

రాష్ట్ర హక్కులను కేంద్రం క్రమంగా లాక్కుంటోందని ఆరోపించారు.



వివరాలు 2లో..

గవర్నర్ ఆర్ఎన్ రవితో విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమిళనాడు స్వయంప్రతిపత్తి కోసం చర్యలను సిఫార్సు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎం స్టాలిన్ అసెంబ్లీలో ప్రకటన చేశారు. రాష్ట్ర హక్కులను కేంద్రం క్రమంగా లాక్కుంటోందని ఆరోపించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ రాష్ట్ర స్వయంప్రతిపత్తిని నిర్ధారిస్తుంది. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాన్ని వివరంగా పరిశీలిస్తుంది. జనవరి 2026లో తన మధ్యంతర నివేదికను సమర్పిస్తుంది. ఈ కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎం. నాగనాథన్ సభ్యులుగా ఉంటారు. సిఫార్సులతో కూడిన తుది నివేదికను ఈ కమిటీ రెండేళ్లలో సమర్పించనున్నట్లు స్టాలిన్ తెలిపారు.

### 'నీట్ పరీక్షను వ్యతిరేకిస్తుంటాం'

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల

## కుల, మత ప్రాంతాలను జగన్ రెచ్చగొడుతున్నారు
# సీఎం చంద్రబాబు ఆగ్రహం

మొదటి పేజి తరువాయి

మత్స్యకార భరోసా అమలుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఎలాంటి గందరగోళం ఉండకూడదు: మనం తీసుకునే రాజకీయ నిర్ణయాల్లో ఎలాంటి గందరగోళం ఉండకూడదని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు ఏది మంచో అదే నిర్ణయాన్ని మనం తీసుకుంటున్నామని వెల్లడించారు. వైఎస్సార్సీపీ వక్ఫ్ బోర్డ్ బిల్లు అంశంలో 3 రకాలుగా వ్యవహరించిందని తెలిపారు. పార్లమెంట్?లో ఒకలా, రాజ్యసభలో మరోలా, కోర్టులో మరోలా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ నేతల రాజకీయ కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండకడుతూనే, మనం తీసుకున్న నిర్ణయాల్లో ఎలాంటి గందరగోళం లేకుండా చూసుకోవాలని మంత్రులకు స్పష్టం చేశారు. ఏపీని తొలిస్థానంలో నిలపడమే లక్ష్యం: అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే తొలిస్థానంలో నిలపడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు తాను ముఖ్యమంత్రిగా ప్రయాణం మొదలుపెట్టిన రోజులను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో బెంగళూరు తొలిస్థానంలో ఉండగా హైదరబాద్‌ను రెండో స్థానానికి తీసుకొచ్చామని అన్నారు. అప్పట్లో తాము తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే నేడు హైదరాబాద్ అన్ని రంగాల్లో ముందుందని అన్నారు. వృద్ధి రేటులో ఇప్పుడు ఏపీ రెండోస్థానంలో ఉందని దీన్ని తొలిస్థానానికి తీసుకెళ్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## అమరావతి పునర్నిర్మాణ పనులు
# – మే 2న రాష్ట్రానికి మోదీ

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ మే 2న అమరావతిలో పర్యటించనున్నారని మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మోదీ పర్యటన మే 2వ తేదీన ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 3 ఏళ్లలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, రహదారులు పూర్తి చేయాలన్న సీఎం వెల్లడించారు. ఇన్?ఛార్జ్ మంత్రుల పర్యటనల్లో 3 పార్టీల నేతల భాగస్వామ్యం ఉండాలని సూచించారు. రెవెన్యూ సంబంధిత అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. రెవెన్యూ సమస్యల్లో పోలీసుల జోక్యం అంశాలను పరిష్కరించాలని తేల్చి చెప్పారు. సూర్యఘర్ పథకం అమలు మరింత వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు.

## వీకెండ్ రాజకీయాలు చేయొద్దు..
# కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు క్లాస్ పీకిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సోషల్‌మీడియా వాడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం చేస్తుంటే.. ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని అన్నారు. వీకెండ్ రాజకీయాలు చేయొద్దని సూచించారు.

## కేసీఆర్ మంచివారు...
# నేను రౌడీ టైప్: ఎమ్మెల్సీ కవిత

మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఎవరైనా బెదిరింపులకు గురి చేస్తే సహించేది లేదని, వారి పేర్లను 'పింక్ బుక్'లో రాసి పెడతామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర స్వరంతో హెచ్చరించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరు కాంగ్రెస్ నేతల తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ 24వ వార్షికోత్సవ వేడుకల సన్నాహాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో కవిత మాట్లాడుతూ, బీఆర్ఎస్ కార్యకర్తలకు కొందరు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారనే సమాచారం తనకు అందిందని తెలిపారు. "ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లు బరాబర్ పింక్ బుక్‌లో రాస్తాం. విడిచి పెట్టేదైతే లేదు. కార్యకర్తలు ఏమీ ఆలోచించవద్దు, ధైర్యంగా ఉండండి" అని ఆమె భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తావన తెస్తూ, "కేసీఆర్ సార్ మంచోడు కావచ్చు. నేను కొంచెం రౌడీ టైప్. ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టేది లేదు" అని కవిత వ్యాఖ్యానించారు. కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన వారిని, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పిన వారిని తాను క్షమించే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. బెదిరింపులకు పాల్పడేది నాయకులైనా, అధికారులైనా ఎవరినీ వదిలిపెట్టబోమని ఆమె తేల్చిచెప్పారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎన్నడూ అరాచకాలకు పాల్పడలేదని, కేవలం అభివృద్ధి, సంక్షేమంపైనే దృష్టి సారించామని కవిత గుర్తు చేశారు. ఇప్పుడు కొందరు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్ కార్యకర్తలను భయపెట్టాలని చూడటం సరికాదన్నారు. "మీ తాట తీస్తాం అంటే భయపడేటోళ్లు ఇక్కడ ఎవరూ లేరు. మీ తాత, ముత్తాత, జేజమ్మ దిగివచ్చినా కూడా భయపడేది లేదు" అంటూ ఆమె కార్యకర్తల్లో స్థైర్యం నింపే ప్రయత్నం చేశారు.

## తమిళనాడు 'స్వయంప్రతిపత్తి' కోసం కీలక కమిటీ
# – స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం

మొదటి పేజి తరువాయి

మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ కమిటీ పరిశోధన చేసి సిఫార్సులు చేస్తుందని స్టాలిన్ పేర్కొన్నారు. అలాగే నీట్ పరీక్ష, త్రిభాషా విధానంపై కేంద్రం అనుసరిస్తున్న తీరుపై విమర్శలు గుప్పించారు. నీట్ కారణంగా చాలా మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. నీట్ పరీక్షను నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉంటామని తెలిపారు.

### త్రిభాషా విధానంపై విమర్శలు

త్రిభాషా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం తమపై హిందీని బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తోందని స్టాలిన్ ఆరోపించారు. తమిళనాడు సర్కార్ జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించినందున, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన రూ. 2500 కోట్లు నిధులను ఆపేసిందని విమర్శించారు. విద్యను ఉమ్మడి జాబితాకు మార్చడానికి అనుమతించే 42వ రాజ్యాంగ సవరణను రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర జాబితాలో విద్య ఉండాలని డిమాండ్ చేశారు.

### గవర్నర్ వర్సెస్ తమిళనాడు సర్కార్

బిల్లుల ఆమోదంపై గవర్నర్, తమిళనాడు ప్రభుత్వం మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుతో స్టాలిన్ సర్కార్?కు ఉపశమనం లభించింది. పెండింగులో పెట్టిన పది బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని న్యాయస్థానం స్పష్టం చేసిన నేపథ్యంలో వాటికి చట్టబద్ధమైన హోదా కల్పిస్తూ ప్రభుత్వం గెజిట్ రిలీజ్ చేసింది. ఈ పరిణామాల వేళ రాష్ట్ర స్వయంప్రతిపత్తిపై సూచనలకు కమిటీని ఏర్పాటు చేస్తూ స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ప్రభుత్వాన్ని పడగొట్టాలని కొందరు కోరుతున్నారన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే.... స్పందించిన మంత్రి పొంగులేటి

మొదటి పేజి తరువాయి

వెంటనే ముఖ్యమంత్రి అయిపోవాలని తండ్రీ కొడుకులు చూస్తున్నారని కేసీఆర్, కేటీఆర్‌లను ఉద్దేశించి అన్నారు.

### పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు



పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి వెల్లడించారు. అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే జీవోను విడుదల చేశామని అన్నారు. భూభారతి వచ్చాక కొత్త ప్రభాకర్ రెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని ఎద్దేవా చేశారు. అందుకే ఆయన భయాందోళనకు గురవుతున్నారని అన్నారు.

# మరో 30 నుంచి 40 వేల ఎకరాలు కావాలి - త్వరలోనే నిర్ణయం నారాయణ

మొదటి పేజి తరువాయి

అమరావతి : ఈ నెలాఖరు నాటికి దాదాపు 15 వేల మంది కూలీలు అమరావతి నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉంటారని మంత్రి నారాయణ చెప్పారు. రాజధాని ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ లభ్యతపై అనంతవరం వద్ద ఉన్న కంకర క్వారీలను ఆయన పరిశీలించారు. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం రైతుల వద్ద నుంచి భూములు తీసుకునే ఆలోచన ఉందని నారాయణ అన్నారు. అయితే ఈ భూములు సేకరించాలా, సమీకరించాలా అనేది ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని నారాయణ చెప్పారు. 30 వేల ఎకరాల్లో ఈ రెండు నిర్మాణాలు పూర్తయితే సుమారు లక్ష మంది యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. రాజధానిలో మొత్తం 92 పనులు చేయాలని వాటిలో 42 పనులకు టెండర్లు పిలిచామన్నారు. ఏడాదిలోపు అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని, రెండో ఏడాదిలో మిగిలిన పనులు పూర్తి అవుతాయని మంత్రి చెప్పారు. రెండో విడత కింద తీసుకునే భూముల వల్ల మొదటి విడతలో భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నామన్నారు. "టెండర్లు అన్నీ దాదాపు పూర్తి అయిపోయాయి. ఈ నెలాఖరు నాటికి ఈ ప్రాంతంలో దాదాపు 15వేల మంది పనులు చేస్తూ ఉంటారు. ఒక సంవత్సరంలోపు అధికారుల భవనాలు పూర్తి చేస్తాం. ఏడాదిన్నర లోపు ట్రంక్ రోడ్లు పూర్తి చేస్తాం. లే ఔట్లలోపు రోడ్లు రెండు సంవత్సరాలలో, ఐకానిక్ టవర్లు మూడు సంవత్సరాలలో కంప్లీట్ చేస్తాము. అన్నీ కూడా పక్కా ప్లాన్?తో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్?తో వంద సంవత్సరాలు ముందుకి వెళ్లి ఆలోచిస్తారు. ఇప్పుడు సిటీ అభివృద్ధి చెందాలంటే మంచి ఇంటర్నేషనల్ ఎయిర్?పోర్టు కావాలి, ఒక స్పోర్ట్స్ సిటీ కట్టాలి అనే ఆలోచన ఉంది. అయితే భూ సేకరణ అయితే 5 వేల ఎకరాలు చేయొచ్చు. అయితే భూ సేకరణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ విలువ కంటే రెండున్నర రెట్లు వస్తుంది. దీని వలన రైతులు



నష్టపోతారు. దానికంటే భూ సమీకరణకే ఇష్టపడుతున్నారని ఎమ్మెల్యేలు చెప్పడం జరిగింది. అయితే ఎయిర్?పోర్టుకు అయిదు వేల ఎకరాలు మిగలాలి అంటే కనీసం 30 నుంచి 40 వేల ఎకరాలు తీసుకోవాలి. భూ సేకరణా, భూ సమీకరణా అనేది చర్చిస్తాము. త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటాము". –

## రేవంత్ సర్కార్‌పై
# కేంద్ర మంత్రి షాకింగ్ కామెంట్స్

మొదటి పేజి తరువాయి

మోదీ ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. బీజేపీకి సౌత్‌లో బలపడాలని ఉంటుంది కదా అని అన్నారు. తాము ఎందుకు సౌత్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటామని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ రంగాల సంస్థలను తాము బలోపేతం చేస్తున్నామని అన్నారు. బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ , బ్యాంకింగ్ రంగాలను లాభాల్లోకి తీసుకువచ్చామని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం కూలిపోతే తమకు ఇప్పటికిప్పుడు ఏం వస్తోందని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పు ఇస్తారని చెప్పారు. గుజరాత్ వ్యాపారులకు ఏం పనిలేదా... వారు ఎందుకు రేవంత్ ప్రభుత్వాన్ని కులుస్తారని ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్ పెంచాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తే బీజేపీ ఏ నిర్ణయం తీసుకోదని అన్నారు. బీజేపీ స్వతంత్ర ఆలోచనా చేస్తుందని.. తాము ఎప్పుడు నిర్ణయం తీసుకోవాలో అప్పుడు తీసుకుంటామని స్పష్టం చేశారు. వక్ఫ్‌చట్టన్ని వ్యతిరేకిస్తున్నారంటే భూ బకాసురులకు వత్తాసు పలకడమేనని కిషన్‌రెడ్డి చెప్పారు.

### వక్ఫ్ చట్టంతో ముస్లింలకు న్యాయం..

వక్ఫ్ చట్టంతో పేద ముస్లింలకు న్యాయం తప్ప అన్యాయం జరగదని కిషన్‌రెడ్డి తేల్చిచెప్పారు. వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయంపైన తాము కోర్టుకు వెళ్లే అవకాశం కల్పించామని అన్నారు. వక్ఫ్ చట్టం తెస్తామని తాము మేనిఫెస్టోలో పెట్టలేదన్నారు. ప్రజల ఆమోదంతో మూడోసారి అధికారంలోకి వచ్చామని.. మేనిఫెస్టో అమలు చేశామని గుర్తుచేశారు. అన్యాక్రాంతం అవుతున్న భూములను కాపాడటమే తమ లక్ష్యమని చెప్పారు. వక్ఫ్ భూములపైన అక్రమంగా లబ్ధి పొందిన వారే ఈ ధర్నాలు చేస్తున్నారని అన్నారు. వక్ఫ్ నుంచి ఆదాయం పెంచుతామని, వచ్చిన ఆదాయాన్ని వారికే పంచుతామని స్పష్టం చేశారు. దేవాలయాలకు, వక్ఫ్‌బోర్డుకు పోలిక లేదని... బోర్డులకు మసీదులపై సంబంధం లేదన్నారు. మసీదులకు వచ్చే ఆదాయం దేవాలయానికి వచ్చే ఆదాయంతో పోల్చాలని అన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము గెలుస్తామనే నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్లు ఏ పార్టీ వారైనా కలుస్తామని.. వారిని తమకు ఓటు వేయమని అడుగుతామని చెప్పారు. పాత బస్తీల్లో హిందువుల



కాలనీలు స్లోగా ఖాళీ అవుతున్నాయని కిషన్‌రెడ్డి అన్నారు.

### వారిని భయపెడుతున్నారు..

వారిని భయభ్రాంతులకు గురి చేసి అక్కడి నుంచి వెళ్లిపోయేలా కొంతమంది చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాత బస్తీకి పరిమితమైన ఎంఐఎం ఇప్పుడు న్యూ సిటీకి విస్తరిస్తోందని అన్నారు. ఎర్రగడ్డ, బోరబండ లాంటి ప్రాంతాల్లో ఎంఐఎం విస్తరిస్తోందని చెప్పారు. వీరికి కాంగ్రెస్, బీఆర్ఎస్ సహకరిస్తోందని ఆరోపించారు. ఎవరు అధికారంలో ఉంటే వారితో ఎంఐఎం నేతలు అంటకాగుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ అయినా దాని బాసు మాత్రం అసదుద్దీన్ ఒవైసీనేనని.. అలాగే కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్‌గాంధీ అయిన దాని బాసు మాత్రం అసదుద్దీన్ ఒవైసీనే అని ఆరోపణలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హెచ్‌సీయూ గురించి ఎక్కడ అనలేదని అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కిషన్‌రెడ్డికి ఇష్టం లేదనే మాటలు చిల్లర మాటలని ధ్వజమెత్తారు. ఎవరైనా అభివృద్ధి జరగకూడదని అనుకుంటారా అని ప్రశ్నించారు. రాజకీయంగా మాట్లాడే మాటలకు తాను ఏం సమాధానం చెబుతానని నిలదీశారు. అంబర్‌పేట, బీహెచ్ఈఎల్, శంషాబాద్ విమానాశ్రయం ఫ్లై ఓవర్లు తాను కేంద్రమంత్రిగా ఉండగానే పూర్తి అయ్యాయని గుర్తుచేశారు. త్వరలో నితిన్ గడ్కరీతో వీటిని ప్రారంభిస్తామని, మరికొన్ని నేషనల్ హైవేస్‌కు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. దేశం మొత్తం మీద ఎంఐఎంకు ఒక స్టాండ్ ఉందని, తెలంగాణకు మరో స్టాండ్ ఉంటుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా అన్ని స్థానాల్లో తాము పోటీ చేస్తామని అన్నారు. ఇక్కడ బీజేపీ గెలవకుండా ఉండేందుకు ఎంఐఎం పోటీకి దూరంగా ఉంటుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రాండ్ ఏంటో వచ్చే ఎన్నికల్లో ప్రజలు చెబుతారని కిషన్‌రెడ్డి అన్నారు.

### సన్నబియ్యంపై క్లారిటీ..

'నేషనల్ ఇజమే నా బ్రాండ్. ఎస్సీ , ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్రాలకే ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కేటగిరీలు చేస్తుంది. మేము తెలంగాణలో అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులకు టాక్స్ రీయింబర్స్‌మెంట్ ఇస్తాం. ఇప్పటికే ఇచ్చిన ట్యాక్స్ ఎగ్జామ్స్ వల్ల చాలామందికి లబ్ధి జరుగుతుంది. రేషన్ బియ్యం వద్ద ఇచ్చే రసీదు చూస్తే తెలుస్తుందని... ఎవరు ఎంత ఇస్తున్నారనేది. మేము ఇచ్చే 5కిలోలు కాకుండా అదనంగా సన్న బియ్యం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. గాలి మాటలు మాట్లాడటం కాదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చేవి పాకిస్థాన్ నుంచో, నరేంద్ర మోదీ జేబులో నుంచో ఇవ్వట్లేదు. రేవంత్ రెడ్డి ఇచ్చేవి ఆయన జేబులో నుంచి ఇవ్వడం లేదు. ఎవరిచ్చిన ప్రజలు కట్టె ట్యాక్స్ నుంచి ఇచ్చేవే. ప్రజలు కట్టె డబ్బులతోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయి. రాష్ట్రం ప్రారంభించే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేంత ఇస్తుంది.. మీరు అడిగినంత ఇస్తుంది. ఉత్తరం రాయగానే డబ్బులు ఇస్తుందా. కేంద్రం వద్ద ఏం మిగులు నిధులు లేవు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## గతంలో టీటీడీ చైర్మన్ గా చేసిన వ్యక్తి
# ఇలా మాట్లాడడమేంటి?: హోంమంత్రి అనిత

మొదటి పేజి తరువాయి

హోంమంత్రి ఆరోపించారు. ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం వంటి అత్యంత పవిత్రమైన, ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాలపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి సైతం బాధ్యతారహితంగా, భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదన్నారు. పింక్ డైమండ్ వంటి కట్టుకథలతో గతంలోనూ దుష్ప్రచారం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చి, మత ఘర్షణలు సృష్టించాలనే దురాలోచనతోనే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, వీటిలో ఎంతమాత్రం నిజం లేదని టీటీడీ ఈవో శ్యామలరావు సైతం స్పష్టం చేశారని తెలిపారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలు జరిగాయని హోంమంత్రి వెల్లడించారు. నరసన్నపేటలో దేవాలయంపై అన్యమత ప్రార్థనలు రాయడం, చర్చి వద్ద అభ్యంతరకర రాతలు రాయడం వంటి సంఘటనల వెనుక మత కల్లోలాలు సృష్టించాలనే స్పష్టమైన కుట్ర కనిపిస్తోందని అన్నారు. కొందరు పాస్టర్ల ముసుగులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, అయితే ప్రభుత్వం సంయమనంతో వ్యవహరిస్తూ పోలీస్ శాఖ ద్వారా పరిస్థితిని అదుపులో ఉంచిందని



వివరించారు. క్రిమినల్ మనస్తత్వం కలిగిన వారు రాజకీయాల్లో ఉంటే ఎటువంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో, అటువంటివి పునరావృతం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, కానీ ప్రభుత్వం పూర్తి అప్రమత్తతతో ఉందని, అలాంటి ప్రయత్నాలను ఆదిలోనే అడ్డుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని, గతంలో ఫ్యాక్షనిజం, నక్సలిజం వంటి తీవ్ర సమస్యలను అదుపు చేసిన ఘనత చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి ఉందని గుర్తుచేశారు. గుజరాత్, మణిపూర్ వంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో నేరాలు పెరుగుతున్నాయన్న ఆరోపణలను ఖండించారు. నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల వంటి సాంకేతికతను వినియోగిస్తున్నామని, ఏ సంఘటన జరిగినా 24 గంటల్లో నిందితులను పట్టుకుంటున్నామని, పోలీస్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. సిట్ దర్యాప్తులపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, విచారణ పూర్తయిన వెంటనే ఆధారాలతో సహా దోషులపై చర్యలు తీసుకుంటామని హోంమంత్రి స్పష్టం చేశారు. తొందరపడి చర్యలు తీసుకుని, నిందితులు కోర్టుల నుంచి తప్పించుకునే అవకాశం ఇవ్వబోమని, పక్కా సాక్ష్యాధారాలతో ముందుకెళ్తామని తెలిపారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని ఆమె గట్టిగా హెచ్చరించారు. దర్యాప్తు సంస్థల విచారణలో జోక్యం చేసుకోవడం సరికాదని, విచారణ పూర్తి కాగానే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, దోషులు శిక్ష అనుభవిస్తారని వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# చెన్నైకి దమ్మున్న ఓపెనర్ దొరికేశాడు..

ఐపీఎల్ 18వ సీజన్‌లో ఓపెనింగ్ జోడీ కుదరక పవర్ ప్లేలో తేలిపోతున్న చెన్నై సూపర్ కింగ్స్ కు దమ్మున్న కుర్రాడు దొరికాడు. తొలి మ్యాచ్‌లోనే బెదురన్నదే లేకుండా బౌండరీలతో చెలరేగాడు 20 ఏళ్ల షేక్ రషీద్ 19 బంతుల్లోనే 27 రన్స్ కొట్టిన తన ఆగమనాన్ని ఘనంగా చాటాడీ యంగ్‌స్టర్. అంతేకాదు ఇప్పటివరకూ చెన్నై తరఫున ఆడిన ఓపెనర్లలో అతిచిన్న వయస్కుడిగా గుర్తింపు సాధించాడీ చిచ్చరపిడుగు. ఇంతకు ముందు ఈ రికార్డు సామ్ కరన్(%ఝుఎ జబతీఖుఅ%) పేరిట ఉండేది. ఆల్‌రౌండర్ సామ్.. 22 ఏళ్ల త132 రోజుల వయసులో సీఎస్కే ఇన్నింగ్స్ ఆరంభించాడు. అయితే.. రషీద్ 20 ఏళ్ల 202 రోజులకే ఓపెనింగ్ చేసి ఈ ఇంగ్లండ్ స్టార్ రికార్డును బద్దలు కొట్టాడు. మొదటి మ్యాచ్‌లోనే చెలరేగిన ఈ యంగ్‌స్టర్ రూపంలో సీఎస్కేకు దమ్మున్న ఓపెనర్ దొరికాడని పలువురు క్రికెటర్లు అంటున్నారు.

ఆర్థిక కష్టాలు ఎదురైనా

ప్రస్తుతం టాక్ ఆఫ్ ది ఐపీఎల్‌గా మారిన షేక్ రషీద్ మన తెలుగింటి కుర్రాడే. అతడి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు. చిన్నప్పుడు రషీద్ తన ఈడుపిల్లలతో గల్లీ క్రికెట్ ఆడేవాడు. అతడు బంతిని కొడితే పక్కనున్న ఇళ్ల కిటికీలు పగిలిపోయేవి. దాంతో, నువ్వు పెద్దయ్యాక నువ్వు స్టార్ క్రికెటర్ అవుతావని స్నేహితులు, బంధువులు అనేవారు. కుమారుడి ప్రతిభను గమనించిన తండ్రి షేక్ బలిషా వలీ.. ఆర్థిక కష్టాలు ఎదురైనా సరే రషీద్‌ను ప్రోత్సహించాడు. హైదరాబాద్‌లో



శిక్షణ ఇప్పించాడు. కోచ్‌ల దగ్గర మెలకువలతో మరింత రాటుదేలిన రషీద్.. రంజీల్లో ఇరగదీశాడు. దేశవాళీలో ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రషీద్.. టాపార్డర్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌లతో రాణించాడు. 19 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన రషీద్ 37.62 సగటుతో 1,204 పరుగులు సాధించాడు. 12 లిస్ట్ ఏ మ్యాచ్‌లతో పాటు 17 టీ20ల్లో సైతం మెరుపులు మెరిపించాడీ హిట్టర్. కొంతకాలంగా నిలకడగా ఆడుతున్న రషీద్ సీఎస్కే టాలెంట్ స్కౌట్ దృష్టిలో పడ్డాడు. దాంతో, మెగా వేలంలో చెన్నై అతడిని రూ. 30 లక్షలు పెట్టి కొన్నది.

నెట్ బౌలర్లకు అకింతం

ఐపీఎల్‌లో తన తొలి మ్యాచ్‌ను జీవితాంతం గుర్తు పెట్టుకుంటానని అంటున్న రషీద్.. లక్నోపై ఇన్నింగ్స్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఓపెనర్‌గా వెళ్లాల్సి రావడంతో ఒకింత నెర్వస్‌గా అనిపించింది. ఎలా ఆడాలి? అనే సందేహం మొదలైంది. అయితే.. ధోనీ, శివం దూబె నా భయాన్ని పోగొట్టారు. ప్రశాంతంగా ఉంటూ నీ స్టయిల్లో ఆడు అని ప్రోత్సహించారు. వాళ్లు చెప్పినట్టే కూల్‌గా ఉండి చెలరేగాను. ఈ ఇన్నింగ్స్‌ను నెట్ బౌలర్లకు అంకితం ఇస్తున్నా. వాళ్లు చాలా అద్భుతంగా బౌలింగ్ చేశారు' అని మ్యాచ్ అనంతరం వెల్లడించాడు రషీద్.

కాంబినేషన్ కుదరక

ఐదుసార్లు ఛాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్ 18వ సీజన్‌లో నిరాశపరచడానికి ఓపెనింగ్ సమస్య ప్రధాన కారణం. రచిన్ రవీంద్రకు తోడుగా ఇన్నింగ్స్ ఆరంభించిన రాహుల్ త్రిపాఠి దారుణంగా విఫలమయ్యాడు. ఆ తర్వాత డెవాన్ కాన్వే( ను ప్రయత్నించగా.. అతడు సైతం దూకుడుగా ఆడలేకపోయాడు. అంతే.. పవర్ ప్లేలో 50 ప్లస్ సైతం కొట్టలేకోయింది సీఎస్కే. అంతేకాదు 180 కంటే ఎక్కువ లక్ష్యాన్ని ఛేదించలేక చతికిలపడుతూ వస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ ధోనీ, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌లు షేక్ రషీద్‌కు అవకాశం ఇచ్చారు. రవీంద్రకు జోడీగా వచ్చిన అతడు.. ఇన్నింగ్స్ తొలి బంతిని ఎదుర్కొన్నాడు. బౌండరీలతో అలరించిన ఈ చిచ్చరపిడుగు.. అవేశ్ ఖాన్ వేసిన 5వ ఓవర్లో ఔటయ్యాడు. 27 రన్స్‌కే వెనుదిరిగినా.. తన దూకుడైన ఆటతో ఆకట్టుకున్నాడీ లెఫ్ట్ హ్యాండర్. వస్తూ వస్తూనే జట్టుకు విజయంలో కీలక పాత్ర పోషించిన రషీద్ తదుపరి మ్యాచుల్లో రవీంద్రతో కలిసి ఓపెనింగ్ చేసే అవకాశముంది.

మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

## సంపాదకీయం

# తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు.

జాతీయోద్యమం, తదనంతర వామపక్ష, విప్లవోద్యమాల నేపథ్యంలో వెలువడిన కవిత్వంలో మహాత్మా గాంధీ, కారల్ మార్క్స్, లెనిన్, మావోల ప్రభావం ప్రగాఢంగా కనిపిస్తుంది. ఈ దిశగా కొంత పరిశోధన జరిగింది. ఆధునిక సాహిత్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రభావం గురించి సమగ్ర చర్చ జరగాల్సిన అవసరముంది. సమకాలీన సంక్లిష్ట సందర్భానికి ఈ చర్చ దారిదీపంలా వెలుగునిస్తుంది. రాజ్యాంగ నైతికత దిశగా సృజనకారులు దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ఆది ఆంధ్ర ఉద్యమం నుండి ఈనాటి దళిత ఉద్యమం వరకూ వెలువడిన వందేళ్ల సాహిత్యంలో అంబేద్కర్ స్ఫూర్తిని విశ్లేషిస్తేనే తెలుగు విమర్శ పరిపుష్టమవుతుంది. కుసుమ ధర్మన్న నుండి ఈనాటి దళిత కవుల వరకూ ఎంతోమంది అంబేద్కర్ ఆశయాలను సముచితంగా కవిత్వీకరించారు. అంబేద్కర్ తాత్త్వికతను శ్వాసగా ఏకైక ధ్యాసగా భావించి ప్రభావశీలమైన కవిత్వం, పాటలు రాసిన ప్రజాకవి రావూరి ఏకాంబరం. నిబద్ధుడైన 'భీమ' కావ్యకర్తగా కార్యకర్తగా అణగారిన వర్గాల్లో ఏకాంబరం అనంత చైతన్యాన్ని కలిగించాడు. అంబేద్కర్ సిద్ధాంతాన్ని 'సిరానిష్టం' చేసుకొన్న ప్రజాకవి రావూరి ఏకాంబరం, కృష్ణా జిల్లా పామర్రు సమీపంలోని నల్లకుంట గ్రామంలో 1924 సెప్టెంబర్ 24న జన్మించాడు. మాల సామాజిక వర్గానికి చెందిన కుటుంబంలో పుట్టిన ఏకాంబరం ఎంతో కష్టపడి కాకినాడ పిఆర్ కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసించాడు. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన పౌర సంబంధాల అధికారిగా 20ఏళ్ళ సేవలందించాడు. గన్నవరం శాసన సభ్యుడిగా షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ పార్టీ నుండి పుచ్చలపల్లి సుందరయ్యపై పోటీ చేసి ఓడిపోయాడు. అంబేద్కర్ అడుగుజాడల్లో మడమ తిప్పకుండాసాగిపోయిన ఈ ధన్యజీవి 2001 ఏప్రిల్ 21న తుది శ్వాస విడిచాడు. విజయవాడ, గుడివాడ ప్రాంతాల్లో 1944లో జరిగిన బహిరంగ సభల్లో అంబేద్కర్ ఆంగ్ల ప్రసంగాన్ని తెలుగులోకి అనువాదం చేసిన ఏకాంబరం, ఆ మహా నాయకుని దృష్టిని ఆకర్షించాడు. ఈ సందర్భంలోనే ఏకాంబరం రాసిన "డాక్టరో అంబేద్కరా! నీ నాయకత్వం లోకమెల్లను మేలు కొల్పెను" అనే పాట ఉభయ గోదావరి జిల్లాల్లో 'భీమ' మంత్రమై మారుమోగింది. "ఇంత పెద్ద విశాలదేశము/ సెంటు భూమి మాకు లేదు/ కసవు గుంటలే కాపురాలు/ జోరుగా పెనుగాలి వీచెను/ బోరుమని జడివాన కురిసెను/ కూలి నాలి జనాళి కొంపలు/ కూలిపోతే కష్టమెవరికి/ మాలవాడని మాదిగోడని మారు పేరు చండాలుడాయని/ మాల మాదిగ లేకమైతే మారిపోదా కాలచక్రం" అంటూ లయాన్వితంగా సాగే ఈ పాటకు నేటికీ ప్రాసంగికత ఉంది. చోడగిరి చంద్రరావు వందలాది సభల్లో ఈ పాటను ఆలపించి, ప్రజలను ఉర్రూతలూగించాడు. ఈ పాట విని అంబేద్కర్ ఆనంద పరవశుడై కన్నీరు పెట్టుకున్నాడని పొనుగుమట్ల విష్ణుమూర్తి తన పరిశోధనా గ్రంథంలో రాశాడు. రావూరి ఏకాంబరం ఆశు కవి. ప్రజాసమూహంలో పర్యటించే క్రమంలో సందర్భానుసారంగా ఆశువుగా, భావగర్భితంగా ఎన్నో పద్యాలు, పాటలు ఆలపించేవాడు. 1944 నుండి 1980 వరకూ ఏకాంబరం ఎన్నో పద్యాలు, పాటలు రాశాడు. వీటిలో చాలావరకు పత్రికల్లో ప్రచురితం కాకపోయినప్పటికీ పాత తరం అంబేద్కరీయుల గుండె గొంతుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. 1984లో రావూరి ఏకాంబరం సాహితీ ప్రచురణ కమిటీ ఏర్పడి ఆయన పద్యాల్లో కొన్నింటిని సేకరించి 'అంబేద్కరో సమర సింహ' పేరుతో పద్యకవితల సంకలనాన్ని ప్రచురించారు. 46 పద్య కవితలున్న ఈ సంకలనం ఎంతో విలువైనది. జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య, బొజ్జతారకం విశ్లేషణాత్మకమైన ముందు మాటలు రాశారు. ఆంధ్ర ప్రాంతంలో అంబేద్కర్ పర్యటించడానికి మూలకారకుడైన నందనార్ హరికి ఈ గ్రంథాన్ని అంకితం చేశాడు కవి. అంబేద్కర్ ఔన్నత్యాన్ని, ఆయన బహుముఖీన ఉద్యమ కార్యాచరణ ఆవశ్యకతను, దేశ పునర్నిర్మాణానికి అవసరమైన సాంస్కృతిక విలువలను ఈ కావ్యం ద్వారా ఏకాంబరం చాటిచెప్పాడు. "నీ మహొజ్వల నిరుపమ నిర్విరామ/ సర్వతోముఖ విప్లవ సమర జ్వాల/ సమతకు పునాది వేసెను భీమ రాయ! భావ విప్లవ సామ్రాజ్య సార్వ భౌమ" అంటూ, నాలుగు దశాబ్దాల పాటు సాగిన అపూర్వమైన అంబేద్కర్ పోరాటాన్ని నాలుగు పాదాల్లో ఏకాంబరం సముచితంగా పద్యీకరించాడు. "దేశభక్తుడెవడొ, దేశద్రోహియెవడొ/ గతచరిత్ర తవ్వి కథలు చెప్పి" పాలకులకు అంబేద్కర్ దిక్సూచిగా నిలిచాడని ఈ కవి నిర్ధారించాడు. కులం, మతం, సంస్కృతి, భగవద్గీత, ప్రజాస్వామ్యం, బ్రాహ్మణవాదం, ప్రతిభ, గాంధీతత్త్వం, రిజర్వేషన్లు, కులాంతర వివాహాలు తదితర అంశాలను అంబేద్కర్ ఆలోచనల వెలుగుల్లో ఈ కవి నిర్వచించాడు. వాటి చుట్టూ రాజకీయ రహస్యాలను బట్టబయలు చేశాడు. ఈ పద్య కవితా సంపుటి అంబేద్కర్ తాత్త్వికతకు ఒక సాహిత్య మేనిఫెస్టోలాగా, రావూరి ఏకాంబరం నిశిత విమర్శనా శక్తికి అక్షర దర్పణంలా కనిపిస్తుంది. నిష్టూరమైన నిజాలను, కఠినమైన వాస్తవాలను, ఆచరణ యోగ్యమైన సామాజిక సత్యాలను తన పద్యాల ద్వారా కవి తేటతెల్లం చేశాడు. "బోధిసత్వుపైన పోటీగా బ్రాహ్మణుల్/ మాంస భక్షణమును మానివేసి/ మాంసభక్షకులని" (గో మాంస భక్షణ) అంటరాని ప్రజలను వెలివేశారని బౌద్ధానికి వ్యతి రేకంగా రగిలిన అలనాటి కుహనావ్యూహాలను కవి తెలియ పరిచాడు. 'పీడిత జననేత భీమరాయ!', 'భీమరాయ అంబేద్కరో సమరసింహ!' లాంటి మకుటాలతో శతక శైలిలో ఏకాంబరం ఈ కావ్యాన్ని రచించాడు. 'విశ్వకళ్యాణదాయక', 'విప్లవాలరేడ', 'దళిత సాహితీ విధాత', 'నవ్య బౌద్ధధర్మ కావ్యశిల్పి' లాంటి

# మీడియా ముసుగులో కుట్రలు




తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకోవడంలో పలు రాజకీయ పార్టీల కుట్రలకు, కుతంత్రాలకు ఏ మాత్రం తీసిపోకుండా తన వంతు పాత్ర పోషించింది ఓ వర్గం మీడియా. తెలంగాణ ఉద్యమాన్ని తక్కువ చేసి చూపించడం మొదలుకొని ఉద్యమాన్ని తప్పుబట్టే ప్రశ్నలు రాసిచ్చి అడిగించడం దాకా అన్ని ప్రయత్నాలు చేసింది. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ప్రతి పోరాటాన్నీ పత్రికల్లో, చానళ్లలో కనిపించకుండా అణచిపెట్టిన సందర్భాలకు లెక్కే లేదు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ అస్తిత్వాన్ని , ఆత్మగౌరవాన్ని సగర్వంగా చాటి చెప్పేలా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పటిష్ఠ చర్యల వల్ల ఈ మీడియా సంస్థలు వెనక్కి తగ్గక తప్పలేదు. అయినప్పటికీ దాదాపు దశాబ్ద కాలం పాటు ఈ తెలంగాణ ద్రోహులంతా నివురుగప్పిన నిప్పులాగానే ఉన్నారు. ఇప్పుడు అధికార మార్పిడి జరిగిన మొదటి రోజు నుంచీ ఇన్నేండ్లు దాచుకున్న అక్కసునంతా వెళ్లగక్కుతున్నారు. 'ఇసుంట రమ్మం టే ఇల్లంతా నాదే' అంటున్నారు. పూటకో కొత్త కుట్రతో తెలంగాణను దోచుకొని ఆగం చేయడమే తక్షణ కర్తవ్యంగా వ్యవహరిస్తున్నారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని అడవి, వన్యప్రాణి పరిరక్షణ నుంచి కేవలం రాజకీయ సమస్యగా మార్చే కుట్ర ఇప్పుడు జరుగుతున్నది. రేవంత్ సర్కార్ బుల్డోజర్లతో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల అటవీ భూమిని నామరూపాల్లేకుండా చేసే ప్రయత్నం మొదలుపెట్టిన దగ్గరి నుంచి తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసిన, పనిచేస్తున్న మీడియా సంస్థల ద్వారా ఈ కుట్రలు మరింత ఊపందుకున్నాయి. సాక్షాత్తు సుప్రీంకోర్టు 'కంచ గచ్చిబౌలి ఫారెస్ట్' అని ప్రస్తావించినా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటిలాగే అబద్ధాల ప్రచార అస్త్రాన్ని సంధిస్తూ వస్తున్నది. ఏప్రిల్ 16న కేసు విచారణ జరగనున్న నేపథ్యంలో కంచ గచ్చిబౌలిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి నివేదిక ఇవ్వడానికి కేంద్ర సాధికార కమిటీ హైదరాబాద్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మూడు పార్టీలు కమిటీకి చుక్కలు చూపించాయని ఓ చానల్‌లో 'బర్నింగ్ టాపిక్' అనే ప్రోగ్రామ్‌లో కథనాలు ప్రదర్శించారు. ఇది ముమ్మాటికీ రాజకీయ అంశంగా ముద్ర వేసే కుట్రే. ఇందులో భాగంగానే ఒకవైపు పార్టీల వాదనలు అని చెప్తూనే, కాంగ్రెస్ మీద ఆరోపణలతో పాటు ఇందులోకి బీజేపీని లాగేసింది బీఆర్ఎస్ అనే తన ఉద్దేశాన్ని ఆపాదించే ప్రయత్నం చేసింది ఆ చానల్. దేశమంతటికి, జాతీయ మీడియాకు ఇది పర్యావరణ కోణంలో కనిపించగా.. తెలంగాణలో చాలా మీడియా సంస్థలకు ఇది రాజకీయ కోణంగా మాత్రమే ఎందుకు కనిపిస్తుందనేది అసలు ప్రశ్న. ఒకవైపు కంచ గచ్చిబౌలి భూములు ముమ్మాటికీ వర్సిటీకి చెందినవేనని సాధికార కమిటీ ఎదుట బీఆర్ఎస్ గట్టిగా వాదించిందని అంటూనే, మరోవైపు ఈ వ్యవహారంలో బీజేపీ మధ్యేమార్గంగా వర్సిటీ వైపు ఉందని ఎల్లో మీడియా చెప్పింది. భూములు యూనివర్సిటీకి చెందినవేననే మాటకు.. వర్సిటీ వైపు ఉండటానికి వ్యత్యాసం ఏంటో వాళ్లకే తెలియాలి. యూనివర్సిటీ వైపు బీజేపీ ఉండటమనేది మధ్యేమార్గం ఎలా అవుతుందో రాసిన వాళ్లకే తెలియాలి. బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం మీద గట్టిగా పోరాడేది కానీ ఇక్కడ విచిత్రంగా కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ మీదే బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. దీని వెనక ఉన్న ఉద్దేశాన్ని కవర్ చేయడానికి సదరు చానల్ గట్టిగానే ప్రయత్నించింది. రూ.10 వేల కోట్ల కుంభకోణం ఆరోపణలు కాంగ్రెస్‌తో పాటు తన మీదికి వచ్చేదాకా కంచ గచ్చిబౌలి భూముల విషయంలో బీజేపీ అంటీముట్టనట్టుగానే ఉందని ఇదే ప్రోగ్రామ్‌లో ఒక వ్యాఖ్య చేయడం కొసమెరుపు. మీడియా కథనాల్లో విశ్వసనీయతపై కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏదైనా కీలక సంఘటన జరిగినప్పుడు సంబంధిత డేటాను, డాక్యుమెంట్లతో సహా సంపాదించి వార్తలు ప్రసారం చేసే ఆ చానల్‌కు కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి డేటా, డాక్యుమెంట్లు కనిపించలేదా? లేక ఈ అంశాన్ని రాజకీయ అంశంగా మార్చడానికి వాస్తవాలు దాచిపెట్టారా? అనేది తెలియాల్సి ఉంది. కాంగ్రెస్ అనుకూల చానళ్ల విషయంలో ఈ సందేహానికి తావు లేదు. ఎందుకంటే కాంగ్రెస్ ప్రభుత్వ అజెండా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అజెండానే వాటి కార్యాచరణ కాబట్టి. బుల్డోజర్లతో చెట్లన్నీ నేలమట్టం చేయడం వల్ల ఆవాసాలు కోల్పోయి కుక్కల దాడుల్లో జింకలు ప్రాణాలు కోల్పోతుంటే.. దాన్ని కప్పిపుచ్చడానికి ఎండాకాలం నీళ్ల కోసం బయటికొచ్చి చనిపోతున్నాయని, హెచ్‌సీయూలో ఇదంతా సహజమని ఎల్లో మీడియా అబద్ధపు కథనాలు వండివారుస్తున్నది. బీకాన్ సంస్థతో టీజీఐఐసీ ఒప్పందం చేసుకునే నాటికి ఆ భూములు నిషిద్ధ జాబితాలోనే ఉన్నాయి. యాజమాన్య హక్కులు లేకుండానే టీజీఐఐసీ ఈ భూములను ఎట్లా కుదువబెట్టి రూ.10 వేల కోట్ల లోన్ తీసుకుందని, భూముల విలువను ఎకరం రూ.100 కోట్ల నుంచి రూ.75 కోట్లకు తగ్గించి, భారీ ఆర్థిక కుంభకోణం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధారాలతో సహా బయటపెట్టారు. అయితే కంచ అంటే గ్రేజింగ్ అని, పశువులు మేసే ప్రాంతమని, ఏండ్లుగా ఖాళీగా ఉండటం వల్ల చెట్లు పెరిగాయని మంత్రి శ్రీధర్‌బాబు తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. గతంలో ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో హామీలన్నీ అమలు చేశామని చెప్పారు. కానీ, తెలంగాణలో క్షేత్రస్థాయిలో హామీలు ఎంతవరకు అమలయ్యాయనేది ప్రజలకు తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చెప్పే మాటల్లో విశ్వసనీయత ఎంతనేది ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'నమ్మికొని అధికారము ఇస్తే నమ్మకము పోగొట్టుకుంటివి పదవి అధికారము బూని పదిలముగా తల బోడిజేస్తివి' అన్న మహాకవి కాళోజీ మాటలను ఇప్పుడు అక్షరాలా నిజం చేసి చూపించింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఈ భూముల వ్యవహారం అటవీ, వన్యప్రాణులు, పర్యావరణం, హెచ్‌సీయూకు సంబంధించినది. దీన్ని దారిమళ్లించి, కేవలం రాజకీయ అంశంగా మారిస్తే అంతిమంగా నష్టం తెలంగాణ సమాజానికే. మరి లాభం ఎవరికి అంటే తెలంగాణ ద్రోహులకు, వ్యతిరేకులకు అనేది సుస్పష్టం.

# పారదర్శకతే ప్రాణం!



మన ఎన్నికల సంఘం(ఈసీ)కి ఇష్టమున్నా లేకున్నా ఈవీఎంలపై సంశయాలు తరచు తలెత్తుతూనే ఉన్నాయి. ఇక్కడే కాదు... వేరే దేశాల్లో సైతం సందేహాలు వినబడుతూనే వున్నాయి. ఆ మధ్య టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ ఈవీఎంలను హ్యాక్ చేయటం సులభమని, దీన్ని తాను నిరూపించగలనని సవాలు విసిరారు. ఇప్పుడు ఆ వరసలో అమెరికా జాతీయ నిఘా విభాగం డైరెక్టర్ తులసి గబ్బార్డ్ సైతం నిలిచారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సమక్షంలో కేబినెట్ భేటీలో ఆమె ఈవీఎంల భద్రతా లోపాలపై పలు ఆధారాలు సమర్పించారు. యథావిధిగా దీనిపైనా మన ఈసీ స్పందించింది. ఆమె వ్యాఖ్యలు మన ఈవీఎంలకు వర్తించబోవని మాట్లాడింది. సమస్యంతా అక్కడేవుంది. మన దేశంలో పార్టీలు చేసే ఆరోపణలకు ఆ సంఘం నోరు మెదపదు. ఒక జాతీయ పార్టీ, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం అయిన కాంగ్రెస్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విషయంలో చేసిన ఆరోపణలకు వెనువెంటనే జవాబివ్వడానికి ఈసీకి తీరిక లేకపోయింది. పార్లమెంటులో ఈవీఎంలపై తీవ్ర దుమారం రేగాక మాత్రమే స్పందించింది. గత ఏడాది నవంబర్ 4న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా ఆ నెల 23న ఫలితాలు ప్రకటించారు. ఆ తర్వాతనుంచి కాంగ్రెస్, ఎన్సీపీ ఈవీఎంలపై సందేహాలు వ్యక్తం చేస్తూనే వచ్చాయి. 95 నియోజక వర్గాల్లో ఈవీఎంలూ, వీవీప్యాట్ స్లిప్‌లూ తనిఖీ చేసి అవి సరిపోలాయో లేదో చెప్పాలని 104 అభ్యర్థనలు వచ్చాయి. వాటిని అంగీకరిస్తే దాదాపు 755 ఈవీఎంల తనిఖీ తప్పనిసరవుతుంది. ఇందులో ఎన్సీపీనుంచి దాఖలైనవే ఎక్కువ. ఇవిగాక న్యాయస్థానాల్లో దాఖలైన ఎన్నికల పిటిషన్లు సరేసరి. హరియాణాలో సైతం ఈవీఎంలపై ఆరుచోట్ల అభ్యర్థనలొచ్చాయి. జమ్మూ కశ్మీర్‌లో ఒక స్థానం నుంచి ఈ మాదిరి వినతి వచ్చింది. ఆరోపణలొచ్చినప్పుడల్లా ఈసీ ఇచ్చే జవాబు ఒకే విధంగా ఉంటున్నది. మన ఈవీఎంలు సురక్షితమైనవి, జొరబడటానికి అసాధ్యమైనవి అన్నదే దాని వాదన. అలాగే అవి ఇంటర్నెట్‌తోసహా దేనికీ అనుసంధానించి వుండవు కనుక వైఫై, బ్లూటూత్‌ల ద్వారా ఏమార్చటం ఏమాత్రం కుదరదని కూడా చెబుతోంది. అమెరికాలోని బోస్టన్‌లో జరిగిన సాంకేతిక సదస్సులో కంప్యూటర్ శాస్త్రవేత్త అలెక్స్ హాల్డర్‌మాన్ ఆనవాలు మిగల్చకుండా ఈవీఎంను హ్యాక్ చేయటం, ఫలితాన్ని తారుమారు చేయటం ఎంత సులభమో నిరూపించారు. వీవీ ప్యాట్ యంత్రాలతో అనుసంధానించివున్నా ఈవీఎంల పనితీరు ఎన్ని సంశయాలకు తావిస్తున్నదో వివరించే గణాంకాలు సదస్సులో సమర్పించారు. కార్నెగీ మెలాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ ఎకార్ట్ ఈవీఎంలో వోటేసిన వెంటనే స్క్రీన్‌పై ఎంపిక చేసుకున్న అభ్యర్థి పేరే కనబడుతున్నా వేరేవారికి వోటు పడటంవంటి ఉదంతాలను వివరించారు. ఇంటర్నెట్‌తో ఈవీఎంలను అనుసంధానించకపోయినా హ్యాక్ చేయటం సాధ్యమేనన్నారు. ఈవీఎంలలో గుట్టుచప్పుడు కాకుండా రిమోట్ యాక్సెస్ సాఫ్ట్‌వేర్‌ను నిక్షిప్తం చేయటంద్వారా ఇది చేయొచ్చన్నది ఆయన వాదన. అసలు ఈవీఎంల రవాణా, పంపిణీ విధానం లోపభూయిష్టంగా ఉన్నదని సమాచార హక్కు చట్టంకింద అడిగిన ప్రశ్నలకు వచ్చిన సమాధానాలు వెల్లడించాయి. తన నిర్వహణలో సమర్థవంతంగా ఎన్నికలు జరుగుతున్నాయని, అందులో సందేహాలకు తావు లేదని ఎన్నికల సంఘం నమ్మటం తప్పేమీకాదు. ఆమాత్రం ఆత్మవిశ్వాసం ఉండటాన్ని ఎత్తిచూపించాల్సిన అవసరం లేదు. కానీ అదే విశ్వాసం అందరిలో కలగటానికి అది చేస్తున్నదేమిటన్నదే ప్రశ్న. పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే, ఆ రోజు రాత్రి, ఆ తర్వాత విడుదల చేసే పోలింగ్ శాతం వివరాలు ఆశ్చర్యం కలిగిస్తున్నా, వాటిల్లో ఎందువల్ల వ్యత్యాసం చోటుచేసుకుంటున్నదో సందేహాతీతంగా అది వివరించలేకపోతున్నది. నిరుడు జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు కావొచ్చు... మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో కావొచ్చు పోలింగ్ శాతం పెరుగుదలలో తీవ్ర వ్యత్యాసం కనబడటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏపీలో పోలింగ్ జరిగిన రాత్రి 8 గంటలకు 68.12 శాతం పోలింగ్ నమోదైందని చెప్పిన ఈసీ మరో నాలుగు రోజులకల్లా దాన్ని 80.66 శాతంగా ప్రకటించింది. నాలుగురోజుల వ్యవధిలో ఈ పెరుగుదల ఏకంగా 12.5 శాతం! సంఖ్యా పరంగా 49 లక్షల వోట్లు పెరిగినట్టు లెక్క! మొదటగా అనుకున్న శాతానికీ, చివరిగా ప్రకటించిన శాతానికీ మధ్య తేడాకు కారణాలేమిటో వివరించే ప్రయత్నం ఈనాటికీ ఈసీ చేయలేదు. మహారాష్ట్రలోనూ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ ముగిశాక 58.2 శాతం పోలింగ్ అని చెప్పి, ఆ తర్వాత దాన్ని 65.02కు పెంచి తీరా కౌంటింగ్ ముందు అది 66.05 శాతం అన్నారు. బ్యాలెట్ విధానంలో ఇలాంటి వ్యత్యాసాలు కనబడ్డాయంటే అర్థం చేసుకోవచ్చు. లెక్కించేది మనుషులే గనుక పొర బడ్డారని సరిపెట్టుకోవచ్చు. కానీ ఈవీఎంల విధానంలో అలా కాదు. ఎప్పటి కప్పుడు పోలైన వోట్ల సంఖ్య తెలిసిపోతుంది. మరి ఈ తేడాల వెనకున్న మతలబేమిటో ఎందుకు చెప్పరు? ఈవీఎంల చార్జింగ్ అమాంతం పెరిగిపోవటంపైనా అనేక సందేహాలున్నాయి. ప్రశ్నించినప్పుడు మౌనం వహించటమే పెద్దరికమవుతుందని ఈసీ భావిస్తున్నట్టుంది. ప్రజాస్వామ్యానికి కీలకమని భావించే ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కరువైతే అది చివరకు ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం పాలు చేస్తుంది. అది ఇప్పటికే ఎంతో కొంత మొదలైంది. అందుకనే బ్యాలెట్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలన్న డిమాండ్ క్రమేపీ పుంజుకుంటున్నది. ఈవీఎంలు నమ్మదగ్గవి కాదని ప్రపంచంలో ఏమూల ఎవరు చెప్పినా ఇక్కడ భుజాలు తడుముకోవటంవల్ల ప్రయోజనం లేదు. అలాగే పారదర్శకతకు ప్రత్యామ్నాయం కూడా ఉండదు.

# లాంగ్‌లిస్ట్‌లూ... షార్ట్‌లిస్ట్‌లూ....



ఆంధ్రప్రదేశ్‌లో వందల ఉగాది పురస్కారాల హడావిడిలో రచయితలు ఉండగా, తెలంగాణలో కంచ గచ్చిబౌలి స్థలాలకు సంబంధించి తమ పర్యావరణ స్పృహను సోషల్ మీడియా పోస్టులతో వెల్లడించే పనిలో సాహితీకారులు ఉండగా దేశాన కొన్ని ఆసక్తికరమైన సాహితీ ఘటనలు చోటు చేసుకున్నాయి. తన మానాన తానుంటూ తన రాతేదో తాను రాసుకుంటూ వచ్చిన హిందీ కవి వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ పురస్కారం ప్రకటించడం వాటిలో ఒకటి. ఆయన సీదాసాదా మనిషి. రచనల శీర్షికలు కూడా బహు సరళంగా ఉంటాయి. 'పనివాడి అంగీ'... 'గోడలో ఒక కిటికీ ఉండేది'... వినోద్ కుమార్ శుక్లా మొదట రచ్చ గెలిచారు. ప్రతిష్ఠాత్మకమైన 'పెన్ నబకోవ్ అవార్డ్'ను 2023 సంవత్సరానికి గెలుచుకున్నారు. ఆ అవార్డు పొందిన ఏకైక భారతీయ కవి ఆయనే. కాబట్టి విలువైన ఆయన సాహిత్యానికి సర్వోత్కృష్ట జ్ఞానపీఠం దక్కడం అందరూ హర్షించారు. శుక్లా గారితో పోటీ పడినవారిలో ఒక తెలుగు పేరు ఉంది. జ్ఞానపీఠం షార్ట్‌లిస్టులో తెలుగు పేరు ఉండటం ఘనతే. రావూరి భరద్వాజ తర్వాత తాము జ్ఞానపీఠ పురస్కారానికి యోగ్యులమని భావిస్తున్నవారు ఉన్నారు. అయితే అలా యోగ్యులమని అనుకునేవారిలో కొందరి పేర్లు హడలిచచ్చేలా ఉన్నాయనే గిట్టనివారూ ఉన్నారు. భారతదేశంలో స్థానికంగా గాని, జాతీయస్థాయిలో గాని షార్ట్‌లిస్టులలో పేరు చేరేవారు కొందరైతే చేర్పించుకునేవారు కొందరు. 'సాహిత్య అకాడెమీ అవార్డు' షార్ట్‌లిస్టుల్లో చేర్చబడ్డాయేమో అనిపించేలా కొన్ని పేర్లు చూసి ఆకలిదప్పులు మాని మంచం పట్టే సాహిత్యాభిమానులు ఉన్నారు. ప్రతిఏటా ఈ షార్ట్‌లిస్ట్ వీరి పాలిట ప్రాణాంతకంగా మారడం ఆందోళనకరం. అయితే అంతర్జాతీయ స్థాయిలో ఇలా చేర్పించుకోవడం సాధ్యం కాదు. అందుకే కన్నడ నేలన ఇప్పుడు సంబరాలు సాగుతున్నాయి. కారణం 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ 2025' షార్ట్‌లిస్ట్‌లో మొదటిసారి కన్నడ పుస్తకానికి చోటు దక్కింది. సీనియర్ కన్నడ రచయిత్రి బాను ముష్తాక్ రాసిన కథాసంపుటి 'హార్ట్ ల్యాంప్' ఈ షార్ట్‌లిస్టులో ఉంది. యాక్టివిస్ట్‌గా ఉంటూ దళిత, మైనార్టీ మహిళా జీవితాలను ఎక్కువగా రాసే బాను ముష్తాక్ పుస్తకంతో పాటు కేవలం 6 పుస్తకాలతో ఉన్న షార్ట్‌లిస్ట్ నుంచి మే 20న విజేతను ప్రకటిస్తారు. 50 లక్షల రూపాయల బహుమతి ఉంటుంది. అదొక్కటే కాదు ఆ నవల ప్రపంచవ్యాప్తంగా పాఠకులకు చేరువవుతుంది. బాను ముష్తాక్ గెలిస్తే కన్నడ భాష ఘనతకు మరో నిదర్శనమవుతుంది. ఇలాగే 2022లో 'రేత్ కీ సమాధి' నవల ఇంగ్లిష్ అనువాదం 'టూంబ్ ఆఫ్ శాండ్'కు గీతాంజలిశ్రీ బుకర్‌ప్రైజ్ గెలుచుకున్నారు. అప్పుడుగాని ఇప్పుడుగాని తెలుగు నవల, కథ ఈ దారుల్లోకి రాకపోవడం మన వరకూ ఘనతే. ప్రపంచ దేశాలలో తెలుగు రాష్ట్రాలలో ఒక జిల్లా అంత ఉన్నవారు, హైదరాబాద్ జనాభా అంత సంఖ్యలో భాషను మాట్లాడేవారు, మన దేశంలో పదేళ్ల కాలంలో కేవలం యాక్సిడెంట్లలో మరణించేంతమంది మాత్రమే రాసే, చదివే భాష ఉన్నవారు కూడా అంతర్జాతీయస్థాయి అవార్డుల లాంగ్‌లిస్టులలో, షార్ట్‌లిస్టులలో కనిపిస్తారు. రెండు కోట్ల మంది జనాభా ఉన్న శ్రీలంక నుంచి ఎందరో అంతర్జాతీయ స్థాయి రచయితలు ఉన్నారు. పది కోట్ల తెలుగు జనాభా నుంచి అంతర్జాతీయ అవార్డుల సంగతి అటుంచి పెంగ్విన్ వంటి ప్రసిద్ధ పబ్లిషర్ల వరకూ చేరే రచనలు ఎన్ని... రచయితలు ఎందరు? 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ 2025' కోసం 12 దేశాల నుంచి 13 మంది రచయితల పుస్తకాలు లాంగ్‌లిస్ట్ అయ్యాయి. విశేషం ఏమిటంటే వీరంతా మొదటిసారి నామినేట్ అయినవారు. బోణి కొట్టి తమ ఉనికి చాటినవారు. వీరి నుంచి ఆరు మందితో షార్ట్‌లిస్టును ప్రకటించారు. ఆ షార్ట్‌లిస్ట్‌లో కన్నడ నుంచి బాను ముష్తాక్ ఉన్నారు. షార్ట్‌లిస్ట్‌ను ప్రకటిస్తూ బుకర్ ప్రైజ్ కమిటి యు.కె.కు చెందిన ట్రాన్స్‌లేటర్ సోఫీ హ్యూస్‌ను ప్రత్యేకంగా ప్రశంసించింది. ఆమె అనువాదం చేసిన రచనలు ఇప్పటికి ఐదుసార్లు లాంగ్‌లిస్ట్‌లో మూడుసార్లు షార్ట్‌లిస్ట్‌లో వచ్చాయి. ఇది రికార్డు. ఇక్కడే తెలుగు వారి ఘనత ఉంది. తెలుగు పుస్తకాలు గతంలో కాని వర్తమానంలోగాని ఇంగ్లిష్‌లో గట్టిగా అనువాదం చేసేవారి సంఖ్య చేతి వేళ్లకు మించి లేకపోవడమే ఆ ఘనత. విదేశాలకు లక్షలమంది తెలుగువారు పైచదువులకు వెళ్లినా వారిలో సాంకేతిక విద్య, దాని వల్ల వచ్చే సంపద లక్ష్యంగా కనిపిస్తుంది గాని లింగ్విస్టిక్స్ చదవడం, ఇతర భాషలు నేర్చి తెలుగు సాహిత్యాన్ని అనువాదం చేయడం అనేదే లేదు. మిగిలిన భాషల వారు ఈ పని చేస్తున్నారు. ప్రపంచ భాషలు నేర్చి తమ సాహిత్యానికి వాహకులుగా మారుతున్నారు. సోఫీ హ్యూస్‌లాంటి వారు మనలో తయారవ్వాలి లేదా మన కోసం రావాలి. సిఫార్సులు, పైరవీలు లేకుండా... గ్రూపులూ గుంపులూ కట్టకుండా మంచి సాహిత్యం కోసం కృషిని లగ్నం చేసిన తెలుగు రచయితలు ఉన్నారు. ప్రపంచం దృష్టికి వెళ్లాల్సిన రచనలు వీరివి కొద్దిగా అయినా సరే ఉన్నాయి. స్థానిక రాజకీయాలకు ఎడంగా జరిగి దేశీయంగా, అంతర్జాతీయ స్థాయిలో మనమేంటి, మనమెక్కడ అనే ఆలోచనతో సాహితీ పరివారం మేలుకోవాల్సిన తరుణం ఇది. రచయితలు, అనువాదకులు, పబ్లిషర్లు, యూనివర్సిటీలు... దండు కట్టి దృష్టి పెట్టగలిగితే నేడు కన్నడ సీమలో జరుగుతున్న సంబరాలు తెలుగులో జరక్కపోవు. షార్ట్‌లిస్టులలో చేరాల్సిన వారి గురించి పట్టకపోతే చేర్చబడేవారే మన ప్రతినిధులుగా కాన వస్తారు.

# నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,




అనంతపురం, : జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఉల్లాస్ కార్యక్రమం కింద జిల్లా స్థాయి కమిటీ కన్వర్జెన్స్ మీటింగ్ ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం కింద స్వయం సహాయక బృందం (ఎస్.హెచ్.జి) సభ్యులు, వంటవారు, సహాయకులు, ప్రభుత్వ రాత్రి వాచ్మెన్, ప్రభుత్వ సహాయక పాఠశాలలు, అంగన్వాడీ సహాయకులు/ ఆయాలు మరియు ఎన్ఆర్ఈజిఎస్ కార్మికులలో క్రియాత్మక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత మరియు డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై దృష్టి సారించి ఈ కార్యక్రమం విమాత్నంగా అమలు చేయబడుతోందన్నారు. 2025-26లో జిల్లాలో మొత్తం 35,286 మందికి సాక్షరత తీసుకురావాలని లక్ష్యం నిర్దేశించడం జరగగా, అందుకు అనుగుణంగా లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నిచోట్ల మహిళలు సంతకం పెట్టలేని పరిస్థితి ఆయా సంఘాల్లో ఉందని, వారు సంతకం పెట్టేలా, చదవగలిగేలా చూడాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమం కింద ఈనెల 16వ తేదీ నుంచి ఆరు రోజులపాటు సర్వే మొదలు పెట్టి నిరక్షరాస్యులను గుర్తించాల్సి ఉందని, సర్వే చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. మే 5వ తేదీ నుంచి సెప్టెంబర్ వరకు అక్షరాస్యత నేర్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం ఐదు నెలల పాటు 200 గంటల వ్యవధిలో రోజుకు 2 గంటల పాటు అమలు అయ్యేలా రూపొందించబడిందని, అంగన్ వాడి కేంద్రాలు మరియు కమ్యూనిటీ సెంటర్లను సాయంత్రం రెండు గంటల పాటు అక్షరాస్యత కేంద్రాల కోసం వినియోగించడం చేయాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని సజావుగా, విజయవంతంగా అమలు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి ఆంజనేయులు, డీఆర్డీఏ పిడి ఈశ్వరయ్య, డిపిఓ నాగరాజునాయుడు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఐపీఆర్ డిఐపిఆర్ఓ గురుస్వామిశెట్టి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



అనంతపురం, : జిల్లాలో జాబ్ మేళాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో 4వ జిల్లా నైపుణ్య కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో ఏప్రిల్, మే, జూన్ కి సంబంధించి మూడు నెలల్లో 8 జాబ్ మేళాలను నిర్వహించాల్సి ఉందని, సోషల్, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్, స్కిల్ డెవలప్మెంట్, డిఆర్డిఏ, ఇతర అన్ని శాఖల అధికారులు జాబ్ మేళాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించిన కార్యాచరణను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం దగ్గరికి వస్తోందని, ఆయా శాఖలకి సంబంధించిన బడ్జెట్ వస్తోందని, పనులు జరుగుతున్నాయని, వాటిని వేగంగా కొనసాగించాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లకు పరిశ్రమలను టైయప్ చేయాలని, ఉద్యోగ సౌకర్యాల కల్పనపై కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పీఎం విశ్వకర్మ యోజన కింద శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, పీఎం విశ్వకర్మ వాట్సాప్ గ్రూప్ తయారు చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ యోజన కింద జిల్లాలో 205 బ్యాచ్ లకు సంబంధించి 6,004 మంది విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరగగా, 111 మందికి శిక్షణ కొనసాగుతోందన్నారు. పీఎం విశ్వకర్మకు సంబంధించి జిల్లా నుంచి జాతీయ అవార్డు కోసం దరఖాస్తు చేయాలన్నారు. విశ్వకర్మ పథకంపై డిఎస్డివో, జిఎం డిఐసి పూర్తిగా దృష్టి పెట్టాలని, శిక్షణ కేంద్రాలను తనిఖీ చేయాలని, శిక్షణ కేంద్రాలు పూర్తి సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ కింద కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు చేరుకోవాలన్నారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ల్యాబ్ ను ఏర్పాటు చేయనుండగా, ఇందుకు సంబంధించిన పనులను వేగంగా చేపట్టాలన్నారు.అనంతరం 2025 - 26 సంవత్సరంలో మొదటి క్వార్టర్ జాబ్ మేళా క్యాలెండర్ కి సంబంధించిన పోస్టర్ లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతపురం అర్బన్ కి సంబంధించి ఏప్రిల్ 25వ తేదీన, రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి మే 2వ తేదీన, కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సంబంధించి మే 16వ తేదీన, రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి మే 23వ తేదీన, గుంతకల్లు నియోజకవర్గం సంబంధించి మే 30వ తేదీన, తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించి జూన్ 6వ తేదీన, సింగనమల నియోజకవర్గానికి సంబంధించి జూన్ 13వ తేదీన, ఉరవకొండ నియోజకవర్గంకు సంబంధించి జూన్ 27వ తేదీన జాబ్ మేళాలను ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.ఈ సమావేశంలో డీఆర్డీఏ పిడి ఈశ్వరయ్య, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, జేఎన్టీయూ ప్లేస్మెంట్ సిఈఏ శ్రీనివాసులు, ఎస్కేయు అధికారి డా.సిహెచ్.కృష్ణ, మెప్మా పిడి విశ్వజ్యోతి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, బిసి కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధి కల్పనా అధికారి కళ్యాణి, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ రమాదేవి, ప్రభుత్వ ఐటిఐ బాయ్స్ ప్రిన్సిపల్ రామమూర్తి, రూడ్ సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, అయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో భక్తులకందుతున్న సౌకర్యాలు అమోఘం

### గతం కంటే ఇప్పుడు అన్నీ బాగున్నాయని భక్తులు చెబుతున్నారు

### తిరుమల శ్రీవారి దర్శనం సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత

### కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులతో కలిసి స్వామి వారి దర్శనం

### వెంగమాంబ నిత్యాన్నదాన సత్రంలో భోజనం చేసిన ఎమ్మెల్యే సునీత



తిరుమల : తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకందుతున్న సౌకర్యాలు చాలా బాగున్నాయని.. ఈ విషయాన్ని భక్తులే స్వయంగా చెబుతున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మంగళవారం ఆమె కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులతో కలిసి శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నారు. ఆలయంలో స్వామి వారి దర్శనం తర్వాత అక్కడ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆమె భక్తులను పలుకరించి.. అక్కడ సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే లడ్డూ నాణ్యతను గురించికూడా ఆరా తీశారు. చాలా మంది భక్తులు గతం కంటే సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని.. దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. అనంతరం ఆమె వెంగమాంబ నిత్యాన్నదాన సత్రానికి వెళ్లారు. అక్కడ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత అన్నదాన సత్రంలో వంటశాలను పరిశీలించారు. అక్కడ పని చేసే సిబ్బందితో మాట్లాడి పలు అంశాల గురించి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే





సునీత మాట్లాడుతూ స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. టీటీడీ నూతన పాలకమండలి వచ్చిన తర్వాత భక్తులకు అన్ని విధాలుగా సౌకర్యాలు మెరుగు పరిచారన్నారు. స్వామి వారి ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే సునీత అన్నారు

# వైయస్సార్ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ ప్రధాన కార్యదర్శిగా సురేష్ రెడ్డి ఎంపిక



ధర్మవరం. : వైయస్సార్ సిపి పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన అప్పి రెడ్డి గారి సురేష్ రెడ్డి ను పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ్ ప్రధాన కార్యదర్శిగా నియమించడం జరిగిందని పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సురేష్ రెడ్డికి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సురేష్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తారని, పార్టీ అభివృద్ధికి పాటుపడతారని వారు తెలిపారు.

# ఘనంగా జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు..

## అగ్నిమాపక అధికారి యు. రాజు




ధర్మవరం. : పట్టణంలోని సంజయ్ నగర్ లో గల అగ్నిమాపక కార్యాలయంలో ఈనెల 15వ తేదీ నుంచి అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమాన్ని అగ్నిమాపక అధికారి యు. రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మొదటి రోజు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, కళాజ్యోతి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్లో అగ్నివి ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి ప్రజలకు వివరిస్తూ వాటర్ డెమో ద్వారా చేసి చూపించడం జరిగింది అని తెలిపారు. అదేవిధంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారించే పద్ధతుల తెలిపే కరపత్రాలను కూడా ప్రజలకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ అగ్నిమాపక వారోత్సవాలు ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు జిల్లా అధికారుల ఆదేశాలమేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా జాతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అగ్ని బద్ధతపై పూర్తి దశలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సాధారణ జాగ్రత్తలు లో భాగంగా ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వస్తువులను చిందిరావందరంగా లేకుండా సక్రమంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంట్లో ఉన్న చిన్న పిల్లలకు అగ్గిపెట్లు, లైటర్లు, టపాకాయలు, ఎలక్ట్రికల్ సామాగ్రి, ఇతర మండే పదార్థములు ఏవి కూడా అందుబాటులో ఉంచరాదని తెలిపారు. అనుకోకుండా జరిగే అగ్ని ప్రమాదాలకు ముందుగానే కొంత నీటిని మీ ఇంటిలో నిల్వ చేసుకోవాలని తెలిపారు. ఇంట్లో వంటింటి క్రింద పై భాగాలలో గాలి, వెలుతురు ఉండేటట్లు చూసుకోవాలని, సిలిండర్ విషయంలో తగు జాగ్రత్తలు కూడా తీసుకోవాలని తెలిపారు. గ్యాస్ లీక్ అవుతున్నట్లు మీకు తెలిసిన వెంటనే రెగ్యులేటర్లను తప్పక ఆపివేయాలని తెలిపారు. వంట చేసేటప్పుడు సరియైన నూలు బట్టలు ఏప్రాన్ దుస్తులు ధరించాలని తెలిపారు. ప్రమాదవశాత్తు మీ బట్టలకు నిప్పు అంటుకుంటే భయంతో పరిగెత్తవద్దని, నేలపై దొర్లి, దుప్పటి లేదా కోటు లేదా పెద్ద టవల్ను చుట్టుకోండి అని తెలిపారు. మీ చుట్టుపక్కల అగ్ని ప్రమాదం జరిగితే ప్రతి ఒక్కరూ ఆరు బయటకు వెంటనే సురక్షితంగా రావాలని తెలిపారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు విలువైన వస్తువులు గూర్చి సమయాన్ని వృధా చేసుకోకుండా వాటి కొరకై తిరిగి లోనికి ప్రవేశించరాదని తెలిపారు. విద్యుత్ పరికరాలకు నిప్పంటుకున్నప్పుడు నీళ్లతో ఆర్పవద్దని దీనివల్ల కరెంటు షాక్ కు తగిలి ప్రాణాపాయము కలగవచ్చునని తెలిపారు. అలా కాకుండా వెంటనే కరెంటును ఆఫ్ చేయాలని తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే పట్టణ అగ్నిమాపక కేంద్రానికి గాని 101 కు సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత




అమరావతి : వెనుకబడిన తరగతుల అభ్యున్నతే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని, గతంలో ఎన్నడూ లేనంతగా బీసీల సంక్షేమానికి నిధులు కేటాయించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎన్నికల్లో బీసీలకిచ్చిన ప్రతి హామీని నెరవేరేస్తున్నామని, ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బీసీ కులాలకు చెందిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల మేలుకు సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచి బీసీ కులాల అభ్యున్నతికి నిధులు కేటాయిస్తూ వస్తున్నారన్నారు. 2024-25 బడ్జెట్లో ఏపీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీసీలకు రూ.39,007 కోట్లు, 2025-26 బడ్జెట్ లో బీసీలకు రూ.48 వేల కోట్లు కేటాయించారన్నారు. ఒకవైపు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే మరోవైపు అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున చేపట్టారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయా కార్పొరేషన్ల చైర్మన్లకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందజేయాల్సిన బాధ్యత మీదేనంటే మంత్రి సవిత స్పష్టంచేశారు.. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారన్నారు. పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారన్నారు. ఇసుకతో పాటు మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. త్వరలో తల్లికి వందనం, రైతు భరోసా పథకాలను కూడా అమలు చేయబోతున్నామన్నారు. తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందజేయనున్నామన్నారు. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు రూ.20 వేలు అందజేయబోతున్నామన్నారు. చేనేతలకు అందజేసే పథకాలపైనా నేతన్నలకు వివరించాలన్నారు. బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తున్నామన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం మేర సీట్లు కేటాయింపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామన్నారు. నామినేటెడ్, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

ఈ సందర్భంగా ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు పలు సమస్యలను మంత్రి సవిత దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రమందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన స్థాయిలో సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. మరికొన్ని సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో కార్పొరేషన్లు కేవలం ప్రకటనలకు, వైసీపీ నాయకులకు రాజకీయ ఉపాధి కల్పనకే పరిమితమయ్యాయన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాకతో బీసీ కార్పొరేషన్లకు పూర్వవైభవం వచ్చిందని మంత్రి సవిత వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నందం అబద్ధయ్య, వీరంకి వెంకట గురుమూర్తి, దూండి రాకేశ్, పి.విజయకుమార్, సదాశివం, ఆర్కే నాయుడు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# శివాలయ నిర్మాణమునకు బండి వేణుగోపాల్ దంపతులు విరాళం..

### శ్రీ షిరిడి సాయి సేవా సమితి అధ్యక్షులు వీరనారాయణ.



ధర్మవరం. : పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు సత్యసాయి నగర్ లో గల శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో నూతనంగా శివాలయం ఆలయ నిర్మాణం కొనసాగుతోంది. ఈ ఆలయ నిర్మాణం పట్ల పలువురు దాతలు ఆలయానికి తమ సహాయ సహకారాలలో భాగంగా భక్తిగా, భక్తులుగా విరాళాలని ఇస్తున్నారు. ఇందులో భాగంగా శివాలయ నిర్మాణమునకు దాతలైన బండి వేణుగోపాల్, భార్య లక్ష్మీదేవి దంపతులు తమ వంతుగా రూ.25,000 రూపాయలను విరాళంగా ఆలయ కమిటీ అధ్యక్షులు వీరనారాయణ ,కార్యదర్శి రామలింగయ్య, డైరెక్టర్ సూర్య ప్రకాష్ కు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ వారు దంపతుల పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, వారిని ఘనంగా సత్కరించారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి మహోత్సవం...

## దేవాలయ ఏర్పాట్లపై దృష్టి.

-భక్తులకు, ప్రజలకు, అసౌకర్యాలు కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలి.

-ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు, దేవాలయ సౌకర్యాలకు మున్సిపల్ కమిషనర్ సహకరించాలి.

-ధర్మవరం పట్టణంలో మే 14న ప్రారంభమయ్యే అయ్యప్ప స్వామి దేవాలయం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి.

-ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వామి విజయకుమార్ కలసి

దేవాలయ సౌకర్యాలపై బిజెపి ఇంచార్జ్ కు విన్నపం.

-మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హిందూ టైగర్ హరీష్ బాబు.



ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలో మే 14వ తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న అయ్యప్ప స్వామి దేవాలయ మహోత్సవాన్ని పురస్కరించుకొని, ఆలయం పరిసర ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లపై అధికారులు కృషి ప్రారంభించారు. మంగళవారం ఉదయం ఆలయ కమిటీ సభ్యులు శ్రీ బి.వి. ప్రకాష్ , పి.జె. విజయ్ కుమార్ (గురు స్వామి) కలిసి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు ని కలిసి వివిధ అభివృద్ధి అంశాలపై విజ్ఞప్తి చేశారు. ఆలయానికి వెళ్లే రహదారి మరమ్మత్తు, వీధిదీపాల నిర్వహణ, కాలువల శుభ్రత, అదనపు విద్యుత్ లైటింగ్ ఏర్పాటు వంటి అంశాలపై తక్షణమే స్పందించిన హరీష్ బాబు , మునిసిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తో కలిసి స్వయంగా ఆలయ ప్రాంగణాన్ని సందర్శించారు. ఆలయం అభివృద్ధి పనులు, భద్రతా చర్యలు, తాగునీటి సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించే దిశగా మున్సిపల్, విద్యుత్, పోలీస్, ఆరోగ్యశాఖల మధ్య సమన్వయంతో ఏర్పాట్లు చేపడతామని హామీ ఇచ్చారు. మే 14న అయ్యప్ప స్వామి ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారని అంచనా వేయబడింది. అందుకు అనుగుణంగా అన్ని విభాగాల్లో పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

# ఇద్దరిపై కేసు నమోదు.

ధర్మవరం, : ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని కేతిరెడ్డి కాలనికి చెందిన సురేశ్, రామాం జినేయులుకు ద్విచక్రవాహనాన్ని కంతులకు ఇప్పించాడు. రామాంజినేయులు సక్రమంగా కట్టకుండా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో సురేశ్ రామాంజినేయ లును తీసుకున్న ద్విచక్రవాహనానికి కంతులు చెల్లించాలని అడిగాడు. దీంతో తరచూ కంతులు చెల్లించమని నీవెందుకు అడుగుతావంటూ గొడవ పడి సురేశ్ ను రామాంజినేయులు, ఆయన భార్య ఉషలు దాడిచేశాడు. దీంతో సురేశ్ పిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

# బలమైన నాయకత్వం తోనే చేరికలు...

## చేరిక. లను ఎవరు ఆపలేరు?

-బిజెపిలోకి వలసల పరంపర.... మాజీ సర్పంచ్ చేరిక.

-బలమైన నాయకత్వం తోనే ధర్మవరంలో చేరికలు.

గ్రామాల్లో బిజెపికి లోకి నాయకులు ఆకర్షితులై... బిజెపిలోకి చేరారు.

-ధర్మవరంలో బీజేపీలోకి పలువురి చేరిక.

అరచేతితో సూర్యుడిని ఆపలేరు..... బీజేపీలోకి చేరికలు ఎవ్వరు ఆపలేరు.

-మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హిందూ టైగర్ హరీష్ బాబు.

బిజెపిలోకి మాజీ సర్పంచులు.

ధర్మవరం రూరల్ : ధర్మవరం మండలంలోని చిన్నూరు బత్తలపల్లి గ్రామానికి చెందిన గడుపుటి నాగభూషణం ఆధ్వర్యంలో, ధర్మపురి మాజీ సర్పంచ్ వెంకటరాముడు మరియు మాజీ సర్పంచ్ పులమరాజుల వారి అనుచరులతో కలిసి మంగళవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. వీరికి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హిందూ టైగర్ హరీష్ బాబు పార్టీ కండువా కప్పి గౌరవంగా ఆహ్వానించారు. ఈ



సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ...... రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బలమైన నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ అభివృద్ధి చూసి ఆకర్షితులైన గడుపుటి నాగభూషణం, వెంకటరాముడు, పులమరాజులు తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరడం ఎంతో హర్షకరం అని తెలిపారు. అలాగే, అరచేతితో సూర్యుడిని ఆపలేని విధంగా, బీజేపీలోకి ప్రజలు వేలకు... వేలుగా చేరడాన్ని ఎవరూ ఆపలేరు అని ధీమా వ్యక్తం చేశారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో పార్టీలో ఈ విధమైన చేరికలతో ధర్మవరం నియోజకవర్గంలో బీజేపీ మరింత బలోపేతం కానుందని హిందూ టైగర్ హరీష్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, రూరల్ మాజీ అధ్యక్షులు భక్తవత్సలా నాయుడు, నేలకోట రామ్మోహన్, మైనార్టీ నాయకులు నబి రసూల్, బోయ చిన్న లింగమయ్య, బోయ గంగాధర్, పోతుకుంట రాజు, ఏకిల లక్ష్మీనారాయణ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తొలగించిన వివో ఏ లను విధుల్లోకి తీసుకోవాలి..... సిఐటియు

### వెలుగు కార్యాలయానికి తాళం వేసిన సిఐటియు నాయకులు




నంద్యాల జిల్లా బేతంచర్ల : బేతంచర్ల మండలంలో అక్రమంగా తొలగించిన వివో ఏ లను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో సిఐటియు మండల నాయకులు ఎన్ వెంకట రమణ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుండి వెలుగు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెలుగు కార్యాలయంలోకి ప్రవేశించి ఏపిఎం పై నినాదాలు చేశారు. వెలుగు సిబ్బంది కార్యాలయం అధికారులను బయటకు పంపించి వెలుగు కార్యాలయం కు తాళం వేసి నిరసన కార్యక్రమం తెలియజేశారు. ఈ సందర్భంగా వివో ఏ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య,సిఐటియు మండల నాయకులు వైబి వెంకటేశ్వర్లు,మధు శేఖర్ లు మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో పనిచేస్తున్న వివోఏలను గ్రామ ఐక్య సంఘాలలో ఎలాంటి తీర్మానాలు లేకుండా, గ్రామ ఐక్య సంఘాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మండల సమైక్యల తీర్మానం చేసి ఎ పి యం అక్రమంగా తొలగించడం చాలా దారుణం అన్నారు. వివో ఏ లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఏపీఎం నిబంధనలకు విరుద్ధంగా వివో ఏ లను తొలగించడం ఎంత వరకు సమాజమని వారు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వస్తే గత ప్రభుత్వ హాయంలో ఉన్న నిర్బంధాలు ఉండవని సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మి ఓటు వేస్తే చిరుద్యోగులు అయినా వివో ఏ లను తొలగించడం అన్యాయమని వారు అన్నారు. తొలగింపుల్లో, నియామకాల్లో ఏపీఎం, సీసీలు ఎటువంటి జోక్యం తగదని గ్రామైక్య సంఘాల అభిప్రాయం మేరకే ఇవి జరగాలని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ఇప్పటికీ ఎవరిని కొనసాగించే పరిస్థితి లేదన్నారు. హైకోర్టు తీర్పును కూడా అమలు చేయని పరిస్థితి మండలంలో ఉందన్నారు. తక్షణమే తొలగించిన వివోలను వెంటనే విధులకు తీసుకోవాలని లేని పక్షంలో నిరాహార దీక్షలకు కూర్చోడానికైనా సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివో ఏలు మరియు గ్రామ ఐక్య సంఘాల లీడర్లు, సభ్యులు, సిఐటియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కమిషనర్‌ను కలిసిన రాష్ట్ర 'దిశ' కమిటీ సభ్యుడు



కర్నూలు : నగరపాలక సంస్థ కమిషనర్ యస్.రవీంద్ర బాబును రాష్ట్ర అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షక 'దిశ' కమిటీ సభ్యులు పేరపోగు చిన్న పవన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో కలిసి, శాలువా కప్పి సత్కరించారు. ఇటీవల దిశ కమిటి సభ్యులుగా నియమించిన పవన్‌ను కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు.

## వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి :అవాజ్




నంద్యాల జిల్లా డోన్ : ఏప్రిల్ 15:- డోన్ పట్టణంలోని అవాజ్ కార్యాలయంలో, బీరువాల సలాం అధ్యక్షతన జరిగిన, ఈ సమావేశంలో డోన్ నియోజకవర్గ అధ్యక్ష, కార్య దర్శులు జలదుర్గం రసూల్, యస్.ఏ చిన్న రహిమాన్ , డి. అక్బర్ బాష మాట్లాడుతూ, బి.జేపీ ఎన్డీయే ప్రభుత్వాలు, ఏప్రిల్ 5 వతేదీన అర్ధరాత్రి వక్ఫ్ సవరణ చట్టము తీసుకొని వచ్చారని దానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఈ చట్టాన్ని, రద్దు చేయాలని, సుప్రీంకోర్టు కు కొన్ని రాజకీయ పార్టీలు, ముస్లిం పర్సనల్ లా బోర్డు, మరియు, ప్రజా సంఘాలు, సుప్రీకోర్టుకు ఆశ్రయించడం జరిగిందన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, ప్రపంచానికి చాటిన ప్రజలమధ్య, హలాల్, పేరుతో, హిజాబ్ పేరుతో, ఆహారం పేరుతో, ట్రిపుల్ తలాక్ పేరుతో, ముస్లిం మైనారిటీల పై భౌతిక దాడులు చేస్తుంటే, వాటిని ఖండించకుండా, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం సరైనది కాదన్నారు. నరేంద్ర మోడీ ముస్లింలకు న్యాయ చేస్తామని మాయ మాటలు చెబుతున్నారు. ఈ చట్టం ముస్లింలకు నష్టమే తప్ప లాభం లేదు.భారత దేశం లో అధిక భూములు ఉన్న సంస్థలు మూడు ఉన్నవి. మిలిటరీ భూములు, రైల్వే రంగం, వక్ఫ్ బోర్డు, భూములు ఉన్నాయని, వక్ఫ్ ఆస్తులపై, నరేంద్రమోదీ గారి కన్ను పడిందని, ఈఆస్తులను కార్పొరేట్ సంస్థలను కట్టబెట్టుకు, మోడీ ప్రభుత్వం సిద్ధమైనదని, ముస్లింల పైన కపట ప్రేమ చూపిస్తున్నారని అవాజ్ నాయకులు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్ బాష, నూరు బాష, మహబూబ్, ఆయేషా, ఖాజా, రఫీ, హుస్సేన్ పాల్గొన్నారు

## మంగళగిరి ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ సీడ్స్ ఛైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి



నంద్యాల జిల్లా డోన్ :అమరావతి మంగళగిరిలోని తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన "ప్రజావేదిక" కార్యక్రమంలో లిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిధర్మవరం వ ం న ే ్న సుబ్బారెడ్డి తో



పాటు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ సురేంద్ర , కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పి.వి.జి.కుమార్ లి ప్రజావేదిక కు వచ్చిన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు వారి నుండి నేరుగా సమస్యలను అడిగి తెలుసుకొని, అర్జీదారుల నుంచి వచ్చిన ప్రతి అంశాన్ని పరిశీలించి, సంబంధిత అధికారులకు వెంటనే పంపిస్తూ పరిష్కార దిశగా చర్యలు తీసుకున్నారు.

## ధర్మవరంలో బీజేపీలోకి పలువురి చేరిక.

### అరచేతితో సూర్యుడిని ఆపలేరు బీజేపీలోకి చేరికల ఆపలేరు.

### - మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు.



ధర్మవరం శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం రూరల్ మండలంలోని చిన్నూరు బత్తలపల్లి గ్రామానికి చెందిన గడుపుటి నాగభూషణం గారి ఆధ్వర్యంలో, ధర్మపురి మాజీ సర్పంచ్ వెంకటరాముడు మరియు మాజీ సర్పంచ్ పులమరాజుల వారి అనుచరులతో కలిసి మంగళవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. వీరికి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు గారు పార్టీ కండువా కప్పి గౌరవంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి బలమైన నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ అభివృద్ధి చూసి ఆకర్షితులైన గడుపుటి నాగభూషణం, వెంకటరాముడు, పులమరాజులు గారు తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరడం ఎంతో హర్షకరం అని తెలిపారు. అలాగే, అరచేతితో సూర్యుడిని ఆపలేని విధంగా, బీజేపీలోకి ప్రజలు వేలం వేలుగా చేరడాన్ని ఎవరూ ఆపలేరు అని ధీమా వ్యక్తం చేశారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో పార్టీలో ఈ విధమైన చేరికలతో ధర్మవరం నియోజకవర్గంలో బీజేపీ మరింత బలోపేతం కానుందని హరీష్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, రూరల్ మాజీ అధ్యక్షులు భక్తవత్సలా నాయుడు, నేలకోట రామ్మోహన్, మైనార్టీ నాయకులు నబి రసూల్, బోయ చిన్న లింగమయ్య, బోయ గంగాధర్, పోతుకుంట రాజు, ఏకిల లక్ష్మీనారాయణ కార్యకర్తలుపాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

### అభివృద్ధి పనులపై అధికారులకు కలెక్టర్ కీలక ఆదేశాలు






శ్రీకాకుళం : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, పరిపాలనాపరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూ పరిపాలన, తాగునీటి సరఫరా, ఐసీడీఎస్, గ్రామ సచివాలయాల పనితీరు వంటి కీలక అంశాలపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన అధికారులను హెచ్చరించారు. మండల స్థాయి అధికారులు తమ మండల కేంద్రాల్లో, జిల్లా స్థాయి అధికారులు కలెక్టర్ కార్యాలయంలో పాల్గొన్నారు. సమావేశంలో భూ పరిపాలన, సమగ్ర శిశు అభివృద్ధి కార్యక్రమం, పట్టణ ప్రాధికార సంస్థలు, గ్రామీణ నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామ సచివాలయ వ్యవస్థ, ఆంధ్ర ప్రదేశ్ సేవా, మీ సేవా వంటి శాఖల పనితీరు సమీక్షించారు. భూ పరిపాలన అంశాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల పరిశీలనను ప్రామాణికంగా డివిజన్ల స్థాయిలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణల క్రమబద్ధీకరణ, గృహ స్థలాల పునఃపరిశీలన, ప్రాథమిక గ్రామాల పునఃసర్వే, ప్రభుత్వ భూముల వివరాలు, నీటి పన్ను వసూళ్లపై సమీక్ష కొనసాగింది. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ప్రణాళికాధికారి, గ్రామీణ నీటిపారుదల అధికారుల మధ్య సమన్వయం తప్పనిసరిగా ఉండాలన్నారు. పల్లె పండుగ నేపథ్యంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో మెటీరియల్ కాంపోనెంట్ వినియోగాన్ని గ్రామ స్థాయి ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్ల వద్దే పర్యవేక్షించాలన్నారు. ప్రధానమంత్రి సూర్య గృహ పథకంలో బ్యాంకులు, కాంట్రాక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రాల్లో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను కోరారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో కొత్త విధానాలను అమలు చేయడంలో ఉద్యోగుల హాజరు, సర్వేలు ముఖ్యమని తెలియజేశారు. పరిశుభ్రతపై, ప్రత్యేకించి ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రమేయం ఉన్న కమిటీల పనితీరు పర్యవేక్షించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార స్థితిగతులు, పరిష్కరించిన ఫిర్యాదుల పరిశీలన, ఆంధ్ర ప్రదేశ్ సేవా, మీ సేవా దరఖాస్తులపై సమగ్ర సమీక్ష జరిగింది. సమీక్షకు ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, డిపీవో భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, ఐసిడిఎస్ పీడి బి.శాంతి శ్రీ, డ్వామా పీడీ సుధాకర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, హౌసింగ్ పీడీ నగేష్, లీడ్ బ్యాంకు మేనేజర్ కిరణ్ కుమార్, జిల్లాలోని ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా, మండల స్థాయి అధికారులు, తదితరులు హాజరయ్యారు.

## పార్నపల్లిడ్యాంలో 520 మంది మత్స్యకార కుటుంబాలు చేపల పట్టే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు

### మత్స్యకార కుటుంబాలకు డబ్బులు డిమాండ్ చేస్తున్న ఆర్వేటి ఆనంద్

### కులాలు,మతాలు పేరుతో రెచ్చగొట్టడం మంచి సంస్కృతి కాదు

### ఇక ఆర్వేటి ఆనంద్ దౌర్జన్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోము

### పార్లపల్లి డ్యాం మత్స్యకారుల సంఘం నేతలు

### నిన్నటి ఆరోపణలను తీవ్రస్థాయిలో ఖండించిన ధర్మవరం నియోజకవర్గకురుబ సంఘం నేతలు



ధర్మవరం : శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం తాడిమర్రి మండలంలో ఆర్వేటి ఆనంద్ మత్స్యకార కుటుంబాలపై చేస్తున్న దౌర్జన్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తక్షణమే మత్స్యకార కుటుంబాలకు ఆర్వేటి ఆనంద్ క్షమాపణ చెప్పాలని కురుబ సంఘం నేతలు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నిన్నటి రోజున భారతీయ జనతా పార్టీ నాయకులు కులాలు మతాల పేరుతో ప్రెస్ మీట్ లు పెట్టడం మంచి పద్ధతి కాదని అక్కడ జరిగిన వాస్తవాలను వెళ్లి మత్స్యకార కుటుంబాలను అడగాలని కురుబ సంఘం నేతలు సూచించార ఆర్వేట్ ఆనంద్ అనే వ్యక్తి తన అహంకారంతో దాదాపు 30 సంవత్సరములుగా పార్నపల్లి డ్యాం లో మత్స్య కార వృత్తిపై జీవిస్తున్న 520 కుటుంబాలపై దౌర్జన్యం చేస్తూ బిజెపి పెద్దల పేర్లు చెప్పుకొని డబ్బులు డిమాండ్ చేస్తున్నారని,వాటిని ఎదుర్కొన్నందుకే కులాలు మతాల పేరిట ఆజ్యం పోస్తున్నారని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్వేటి ఆనంద్ దౌర్జన్యాలను ఒప్పుకునే ప్రసక్తే లేదని కురుబ సంఘం నేతలు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ బీసీలకు అండగా ఉండే పార్టీనేనని అయితే దౌర్జన్యాలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ బీసీ సంఘాల నాయకులు హెచ్చరించారు

**మత్స్యకార కుటుంబాలపై దౌర్జన్యం చేయాలని చూస్తే సహించబోము**

అదేవిధంగా మత్స్యకార వృత్తిలో ఉన్న మేము ఆర్వేటి ఆనంద్ కు ఒక్క నయా పైసా కూడా ఇచ్చే ప్రసక్తేలేదని ఇది 520 మంది మత్స్యకార కుటుంబాలకు చెందిన ఆస్తిని దీనిలో ఏఒక్క నాయకునికి సంబంధం లేదని మత్స్యకార సంఘం నేతలు అన్నారు. మొదటిగా ఆర్వేటి ఆనంద్ మత్స్యకార కుటుంబాల వద్దకు వచ్చి కొంతమంది బిజెపి నేతల పేర్లు చెప్పి వారిని కలిసేంతవరకు ఇక్కడ చేపలు పట్టరాదని అల్టిమేటంజారీ చేయడం జరిగిందని దాన్ని తిప్పి కొట్టినందుకే తాడిమర్రి మండల తెదేపా కన్వీనర్ కూచిరాముపై లేనిపోని అభాండాలు వేస్తున్నారని అసలు ఈ విషయంలో అతను జోక్యం చేసుకోలేదని మత్స్యకార కుటుంబాలకు అండగా నిలబడినందుకే కూచి రాముపై అగ్రవర్ణాల దౌర్జన్యం అనడం నీతి బాహ్యమైన మాటలని వీటిని మత్స్యకార కుటుంబాలు తీవ్రస్థాయిలో ఖండిస్తున్నామని వారు అన్నారు ఏది ఏమైనా ఆర్వేటి ఆనంద్ దౌర్జన్యాలనుపూర్తిస్థాయిలో అడ్డుకుంటామని మత్స్యకార కుటుంబాల వారు అన్నారు

## ధర్మవరం పట్టణంలో మే 14న ప్రారంభమయ్యే అయ్యప్ప స్వామి దేవాలయం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

### - మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు.



ధర్మవరం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో మే 14వ తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న అయ్యప్ప స్వామి దేవాలయ మహోత్సవాన్ని పురస్కరించుకొని, ఆలయం పరిసర ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లపై అధికారులు కృషి ప్రారంభించారు. ఈ రోజు ఉదయం ఆలయ కమిటీ సభ్యులు శ్రీ బి.వి. ప్రకాష్ గారు, పి.జె. విజయ్ కుమార్ (గురు స్వామి) కలిసి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు గారిని కలిసి వివిధ అభివృద్ధి అంశాలపై విజ్ఞప్తి చేశారు. ఆలయానికి వెళ్లే రహదారి మరమ్మత్తు, వీధిదీపాల నిర్వహణ, కాలువల శుభ్రత, అదనపు విద్యుత్ లైటింగ్ ఏర్పాటు వంటి అంశాలపై తక్షణమే స్పందించిన హరీష్ బాబు , మునిసిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తో కలిసి స్వయంగా ఆలయ ప్రాంగణాన్ని సందర్శించారు. ఆలయం అభివృద్ధి పనులు, భద్రతా చర్యలు, తాగునీటి సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించే దిశగా మున్సిపల్, విద్యుత్, పోలీస్, ఆరోగ్యశాఖల మధ్య సమన్వయంతో ఏర్పాట్లు చేపడతామని హామీ ఇచ్చారు. మే 14న అయ్యప్ప స్వామి ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారని అంచనా వేయబడింది. అందుకు అనుగుణంగా అన్ని విభాగాల్లో పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

## గర్భిణీలకు అన్నదానం చేసిన ముస్లిం మైనారిటీ సోదరులు



సోమందే పల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణిలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వారు మాట్లాడుతూ ప్రతి మంగళవారం వివిధ ఆరోగ్య పరీక్షలకు వచ్చే గర్భిణి స్త్రీలకు నెలలో మూడు మంగళవారాలు అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అన్నదాతలు,ఇందులో భాగంగా ప్రతి నెల మూడవ మంగళవారం సోమందేపల్లికి చెందిన ముస్లీం మైనారిటీ సోదరులు గత నెలలో,రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గర్భిణీలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా మంగళవారం గర్భిణీలకు, ప్రభుత్వ వైద్యులు



ఓంకార్,సిహెచ్ ఓ రవీంద్ర సమక్షంలో,జామీయా మసీదు కార్యదర్శులు అక్రమ్ బాషా,యూడి కుళ్ళాయప్ప,అన్సర్ బాషా,హాజీ అక్బర్,వాజిద్ ల ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతిగా ఉన్న ప్రతి అమ్మకు కడుపు నిండా అన్నం పెట్టి,రాబోయే తరం ను బలవంతులుగా చేయడమే తమ లక్ష్యమని ముస్లిం సోదరులు అన్నారు.ఈ కార్యక్రమంలో మేస్త్రీ చాంద్ బాషా,చికెన్ షాపు అబ్దుల్లా,మహబూబ్ బాషా,వెల్డింగ్ షాపు షాషా,ఈద్గా కమిటి ప్రచార,సమాచారా ప్రతినిధి బాబాఫక్రోద్దిన్,త్యాగి తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డులో ప్రతిభ కనపరిచిన డోన్ విద్యార్థులు జోనాథన్, సూసన్ గ్రేస్



నంద్యాల జిల్లా డోన్ : గిన్నిస్ వరల్డ్ రికార్డులో డోన్ పట్టణ నివాసి కొండెపోగు ఇసాక్ మరియు ఎస్తేరు రాణి ల కుమారుడు కొండేపోగు జోనాథన్ 14 సం.లు సాన్జో పాఠశాలలో తొమ్మిదవ తరగతి మరియు కొండేపోగు సూసన్ గ్రేస్ 11 సం. లు పట్టణంలోని సాంజో పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నారు. హలేల్ మ్యూజిక్ స్కూల్ విజయవాడ వ్యవస్థాపకులు అగస్టిన్ దండింగి వేణుగోపాల్ గారి ఆధ్వర్యంలో డిసెంబర్ 1 2024 లో కీబోర్డ్ వాయిస్తూ ఇన్స్టాగ్రామ్ లో 1046 మంది అప్లోడ్ చేస్తూ రికార్డ్ చేయడం జరిగింది. ఇప్పటివరకు ఎవ్వరు ఇలాంటి రికార్డ్ చేయలేదు. దీన్ని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ వారు గుర్తించడం జరిగింది. అందుకుగాను ఏప్రిల్ 14 2025 న హైదరాబాదులో గిన్నిస్ రికార్డ్ వారు పాల్గొన్న విద్యార్థులందరికీ అగస్టిన్ దండింగి వేణుగోపాల్ గారి చేతుల మీదుగా సర్టిఫికెట్ మరియు మెడల్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి బ్రదర్ అనిల్ కుమార్ , సుజాత రాయ్, ఆనంద్ రాజేంద్రన్ , ముఖ్య అతిథులుగా విచ్చేసినారు.

## జూనియర్ రెడ్ క్రాస్ విభాగం ఏర్పాటు ప్రథమ చికిత్స పై అవగాహన



శ్రీకాకుళం : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి శ్రీకాకుళం జిల్లా శాఖ వారు, శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు స్థానిక సెయింట్ జోసెఫ్ హై స్కూల్ లో జూనియర్ రెడ్ క్రాస్ విభాగం ప్రారంభించి మరియు జూనియర్ రెడ్ క్రాస్ వాలంటీర్స్ కు ప్రథమ చికిత్స పై మరియు సిపిఆర్ పై తన కార్యక్రమం చేయడం జరిగినది . ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్, పి.జగన్మోహన్ రావు, స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ ప్రభావతి ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమం ప్రారంభించారు. జూనియర్ రెడ్ క్రాస్ ద్వారా చేయవలసిన కార్యక్రమాల మరియు ఆవశ్యకత, అలాగే ప్రథమ చికిత్సలో ఉన్న సిపిఆర్, రికవరీ, యాంటీషాక్, ఎలక్ట్రికల్ షాక్, స్నేక్ బైట్ హార్ట్ ఎటాక్ తదితర






అంశాల్లో ప్రథమ చికిత్స చేసి ఎలా బ్రతికించాలో జిల్లా రెడ్ క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ శిక్షణ విద్యార్థులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ పి. జగన్మోహన్ రావు జూనియర్ రెడ్ క్రాస్ వాలంటీర్స్ ను ఉద్దేశించి నేటి కాలం విద్యార్థులు విద్యతో పాటు సమాజ సేవకు ముందుండాలని మరియు ప్రథమ చికిత్స నేర్చుకుని, రెడ్ క్రాస్ ద్వారా మరిన్ని సేవలు చేయాలని కోరడం జరిగింది. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ స్కూల్ జూనియర్ రెడ్ క్రాస్ కన్వీనర్స్ పి.రామకృష్ణ మాస్టర్, ఈ రమాదేవి మేడం, రెడ్ క్రాస్ స్టాఫ్, ఉమా శంకర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్లు జాబితా తయారీ చేయుటకు

# రాజకీయ పార్టీల ప్రతినిధులుతో సమావేశం



శ్రీకాకుళం : మంగళవారం శ్రీకాకుళం తహశీల్దారు వారి కార్యాలయం, శ్రీకాకుళం నందు ఓటర్ల నమోదు అధికారి, నెం.5 శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం, రెవిన్యూ డివిజనల్ అధికారిణి కె. సాయి ప్రత్యూష అధ్యక్షతన శ్రీకాకుళం నియోజకవర్గంలో వున్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులుతో సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో ఎన్నికల సంఘం వారి ఆదేశాలు ప్రకారం ప్రతి నెల జరుగుతున్న అన్ని రాజకీయ పార్టీల సమావేశం లో మంచి ఓటర్లు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల వారు తగు సూచనలు, సలహాలు ఇవ్వవలిసినదిగా తెలియచేసినారు. ఈ సమావేశం లో ఓటర్లు జాబితా లో వున్న మరణించిన, వివాహం జరిగిన ఓటర్లు తొలిగించుటకు చర్యలు తీసికోవలిసినదిగా అన్ని రాజకీయ పార్టీ ల వారు తెలియచేసి వున్నారు. అలాగే ఒక్కే కార్డుతో ఒక్క వ్యక్తి కి రొండు ఓట్లు వున్న మొత్తం జాబితా 171 ను అన్ని రాజకీయ పార్టీల వారికి సమావేశం లో ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో శ్రీకాకుళం తహసిల్దార్ ఎస్. గణపతి రావు, శ్రీకాకుళం ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ జి. కె. శ్రీనివాసరావు, తహసీల్దార్, గార తాసిల్దార్ పద్మావతి, మాదారపు వెంకటేష్ - టీడీపీ, కుమారి - కాంగ్రెస్, ఏ.శ్రీనివాసరావు వైఎస్ఆర్సిపి ,ఆర్ .పురుషోత్తం - బిజెపి పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ



శ్రీకాకుళం : మెగా డీఎస్సీ (ఎస్జీటీ స్కూల్ అసిస్టెంట్ - అన్ని సబ్జెక్టులు) పరీక్షలకు సిద్ధమవుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ), ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు బిసి స్టడీ సర్కిల్ ఉచిత ఆన్‌లైన్ శిక్షణను అందిస్తోందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు ఇంగ్లీషు మీడియంలలో అందుబాటులో ఉండే ఈ శిక్షణకు టెట్‌లో ఉత్తీర్ణులైన వారు అర్హులు. టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల జాబితాలు, టెట్ మార్కుల జాబితా, కుల ఆదాయ ధృవపత్రాలు (రూ. 2 లక్షల లోపు), రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో శ్రీకాకుళం పట్టణంలోని 80 ఫీట్ రోడ్, టీడీపీ భవనం వెనుక ఉన్న బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 7382975679, 9295653489 నెంబర్లను సంప్రదించగలరని సూచించారు.

## ఈనెల 20 న ఈస్టర్ పండుగ శుభ

# సందర్భంగా బీదలకు చీరలు పంపిణి



నంద్యాల జిల్లా డోన్ : ప్రార్థన ఆ సమయం ఆధ్వర్యంలో క్రైస్తవ లోకమంతా ఈస్టర్ పండుగ జరుపుకునే సందర్భంలో డోన్ రైల్వే స్టేషన్ లో యాచకులకు చీరలు ఇవ్వడం జరిగింది జానాప్రభాకర్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే తర్వాత ఆదివారము ఈస్టర్ పండగ జరుపుకుంటారు క్రీస్తు చనిపోయి తిరిగి లేచిన దీనిని ఈస్టర్ గా జరుపుకుంటారు ఈ సంతోషంలో పేదలకు చీరలు ఇవ్వాలని ఉద్దేశంతో మేము అడిగిన వెంటనే డోన్ పట్నానికి చెందిన యాదగిరి, ప్రజ్వలత,దంపతుల కుమారుడు నిస్సి బెన్హర్ పుట్టినరోజు సందర్భంగా ఇచ్చి ఉన్నారు సందర్భం ఏదైనా గాని పేదలకు సహాయం చేసే మనసు ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని చీరలు తీసుకున్న నిరుపేదలు కృతజ్ఞత తెలిపినారు దాత కుటుంబం చల్లగా ఉండాలని దీవించినారు ఈ సయ్యద్ మున్న జాన ప్రభాకర్ పాల్గొన్నారు

# నమ్మిన వారికి కొంగు బంగారం రేణుక ఎల్లమ్మ



పామిడి (:మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ ప్రక్కన నూతనముగా వెలసిన రేణుక ఎల్లమ్మ (రామేశ్వరమ్మ)దేవతను నమ్మిన భక్తులకు కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా పేరొందడంతో వారం వారంకి భక్తాదులు వరుస పట్టారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కారం చేసిందని, మా కోరికలు నెరవేయాని, జరిగినది జరగబోయేది చెప్పిందని, గ్రహదోషం తొలగించిందంటూ వచ్చిన రక్తాదులు సాక్షాలిస్తున్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం బత్తాదులతో దేవాలయ ఆవరణం కిక్కిరిసిపోతున్నది. వారి మొక్కులు నెరవేరవేరు తున్నందున పలు రకాలుగా మొక్కుబడులు,ముడుపులు చెల్లించుకుంటున్నారు. కొప్పులకొండ వారిచే ప్రత్యేక భజన బృందం వారం వారం పాల్గొంటున్నారు.రంగనాయకులు ఓబులపతి, బెస్త సుబ్రహ్మణ్యం, ఓబులేసు తదితరులు కార్యనిర్వాహకులుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.

## నార్పలలో కలెక్టర్,ఎమ్మెల్యే బండారు శ్రావణి

# చేతుల మీదుగా సూక్ష్మ,సేద్య పరికరాల పంపిణీ.!

రైతుల కోసం తెదేపా నేత ఆకుల విజయ్ కుమార్ బాబు పిలుపు.!



శింగనమల : శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో రేపు ఉదయం 10:00 గంటలకు సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమం జరగనుంది.ఈ కార్యక్రమాన్ని నార్పల హై స్కూల్ గ్రౌండ్ లో నిర్వహించనున్నారు. శింగనమల నియోజకవర్గానికి మంజూరైన ఈ పరికరాలను లబ్ధిదారులకు అందజేయనున్నారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి,ఐ.ఎ.ఎస్ మరియు శింగనమల నియోజకవర్గం శాసన సభ్యురాలు బండారు శ్రావణి శ్రీ ముఖ్య అతిథులుగా హాజరై,లబ్ధిదారులకు పరికరాలను స్వయంగా అందజేయనున్నారు.నార్పల మండల తెదేపా నాయకులు ఆకుల విజయ్ కుమార్ బాబు మాట్లాడుతూ,ఈ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వ హించేందుకు రైతులు,అనుబంధ శాఖల అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు, ఆరు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు పర్యావరణ హితమైన,తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను ఇచ్చే సూక్ష్మ సేద్య విధానాలపై అవగాహన పెంపొందించాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు.



# బాలికపై అత్యాచారం ఘటనపై ఫోక్సో కేసు నమోదు

నంద్యాల జిల్లా డోన్( : డోన్ పట్టణ పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఒక పోక్సో కేసు నమోదైంది. 9 సంవత్సరాల బాలిక తన దగ్గరి బంధువు చేత డోన్ పట్టణ శివారులో లైంగిక దాడికి గురైనది. సోమవారం సాయంత్రం 4:00 గంటల సమయంలో నిందితుడు బాలికకు కొత్త బట్టలు కొనిస్తానని చెప్పి బాలికను ఇంటి నుంచి మోటార్ సైకిల్ పై పట్టణ శివారులోకి తీసుకెళ్లి బాలిక పై లైంగిక దాడి చేశాడు. ఆ తర్వాత ఆమెను తిరిగి ఇంటికి తీసుకురాగా బాధిత బాలిక విషయాన్ని తన తల్లి కి చెప్పడంతో తల్లి పట్టణ పోలీసులను ఆశ్రయించగా బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం డోన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు.

## తుంపెరలో అకాల వర్ష బీభత్సం బాధిత

# కుటుంబానికి ఆకుల విజయకుమార్ బాబు అండ.!

అకాల వర్షంతో ఇల్లు కూలిన బాధితురాలుకు ఆకుల విజయ్ కుమార్ బాబు ఆర్థిక సాయం.!





శింగనమల,: నార్పల మండలంలోని తుంపెర గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షం తీవ్ర నష్టం మిగిల్చింది.బీసీ కాలనీలో నివసిస్తున్న వడ్డే సంపంగి చెన్నమ్మ ఇంటిమీద భారీ చెట్టు కూలిపోయి ఇల్లు ధ్వంసమైంది.ఈ ఘటనతో చెన్నమ్మ కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురైంది.ఈ విషాద ఘటన సమాచారం అందుకున్న తెలుగుదేశం పార్టీ మండల నాయకుడు ఆకుల విజయకుమార్ బాబు మంగళవారం తుంపెర గ్రామానికి చేరుకుని బాధితు రాలిని పరామర్శించారు. పరిస్థితిని దగ్గరగా పరిశీలించిన ఆయన, తమవంతుగా ఆర్థికంగా సహాయం చేస్తూ రూ.10,000ను అందించారు. బాధితురాలు చెన్నమ్మ, ఆకుల విజయకుమార్ బాబుకు హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు.స్థానికంగా ఆయన చర్యలు మంచి స్పందన పొందాయి.ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీవో మా పై కక్ష సాధింపు తగదు

# : క్షేత్ర సహాయకురాలు నాగమణి.!

ఉపాధి పనులపై అధికారుల నిర్లక్ష్యం: కూలీలకు 10 వారాలుగా వేతనాలు లేవు.!

"అసత్య ఆరోపణలు రుజువు చేయండి" ఎదుగుతున్న మహిళా సహాయకురాలి గళం.!



శింగనమల,: శింగనమల నియోజకవర్గం, నార్పల మండలంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులలో ఏపీఓ వైఖరిపై క్షేత్ర సహాయకురాలు నాగమణి ఆగ్రహం వ్యక్తం చేశారు.గత పది వారాలుగా పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు.బుధవారం రోజున పత్రికా సమావేశం నిర్వహించిన ఆమె,ఉపాధి కూలీలతో కలిసి అధికార దుర్వినియోగాన్ని బయట పెట్టారు.ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ, "మాకు నాగమణి ఎలాంటి ఇబ్బందులు పెట్టడం లేదు. పనులకు మేము వస్తున్నాం. కానీ వేతనాలు ఇవ్వడం లేదంటే మా కుటుంబాలు ఎలా బతుకుతాయి?" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఓ వద్దకు పనులకోసం వెళ్లినా స్పందన లేకుండా ఉంటోందని నాగమణి వాపోయారు.తన ఎదుగు దలపై కొందరు అసత్య ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని,వాటిని ఆధారాలతో రుజువు చేయాలని సవాలు విసిరారు. "కూలీల కోసం నేనూ నా బాధ్యతల కోసం నిబద్ధంగా ఉన్నాను.కానీ ఏపీఓ తరచూ పనులను నిరాకరిస్తూ, అనవసరమైన ఆటంకాలు సృష్టిస్తున్నాడు,"అని ఆమె పేర్కొన్నారు.గతంలో జరిగిన అవకతవకలపై ప్రశ్నించటం వల్లే ఈ కక్షతత్వం బయట పడుతోందని ఆమె అభిప్రాయపడ్డారు.కనీసం వేతనాలైనా సమయానికి ఇవ్వండి,"అంటూ వారు విన్నవించారు.ఈ ఘటన స్థానిక పాలన లోపాలను, అధికారి-సిబ్బంది మధ్య ఉన్న విభేదాలను బయట పెడుతోంది.అధికారులు దీనిపై స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.

## జిల్లా రైతు సంఘాల నాయకుల కలయిక సమన్వయం పట్ల చర్చలు.!

జిల్లా రైతు సమస్యల పరిష్కారానికి సంఘీభావంగా నేతల గళం.!




శింగనమల,: అనంతపురం జిల్లా, శింగనమల నియోజకవర్గం, అఖిల భారత కిసాన్ సభ మహాసభలు తమిళనాడులో ప్రారంభం.తమిళనాడు నాగపట్నంలో 30వ అఖిల భారత కిసాన్ సభ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి.జాతీయ రైతు నాయకులు మహా సభలలో పాల్గొన్న ప్రముఖులు జాతీయ రైతు సంఘం



ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య,రాకేష్ తికాయత్,ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.ఏపీ నుంచి జిల్లా స్థాయి నాయకులు మల్లికార్జున,చిన్నప్ప యాదవ్, మహాదేవ్,గోవిందు,సూర్య నారాయణ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర స్థాయి నాయకులతో భేటీ ఉద్యమాలపై చర్చలు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య,ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్, నరసింహులు,ఉమర్ తదితరులు రైతుల సమస్యలపై చర్చించారు. రైతుల హక్కుల కోసం నిరంతర పోరాటం అవసరం నాయకుల స్పష్టం.రైతు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని జాతీయ,రాష్ట్ర నాయకులు ఒకే స్వరం పునరుద్ఘాటించారు.

## నార్పలలో ఏడాది క్రితం జరిగిన నగదు

# దొంగతనం కేసులో నిందితుడు అరెస్ట్.!

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు సీఐ,ఎస్సై కృషికి మెచ్చిన ఎస్పీ.!





శింగనమల,: శింగనమల నియోజకవర్గం, నార్పల మండల కేంద్రంలో గత సంవత్సరం చోటు చేసుకున్న రూ.3 లక్షల నగదు దొంగతనానికి సంబంధించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు నాయుడుకు చెందిన నగదు 2024 అక్టోబర్ 5న సంత బజారులో బైక్ నుండి చోరీకి గురైంది.కేసును విచారించిన పోలీసులు సోమవారం రోజు నిందితుడు ఎరికిల బండి చిన్నను నార్పల పెట్రోల్ బంక్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్సై సాగర్ వివరాలు వెల్లడించారు.సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు జరిపి నిందితుడిని గుర్తించామన్నారు.నార్పల సంత బజారులో రైతు శ్రీనివాసులు నాయుడు తన భార్యతో కలిసి స్టేట్ బ్యాంకు నుండి నగదు తీసుకొని బట్టల దుకాణానికి వెళ్లిన సమయం లో,బైక్‌లో పెట్టిన డబ్బును ఎరికిల బండి చిన్న అనే దొంగ అపహరించాడు.పోలీస్ శాఖ ఈ కేసును నిర్లిప్తంగా వదలక పోయింది.సీసీ కెమెరాలను శోధిస్తూ,అనుమానితులను పరిశీలిస్తూ చివరకు నిందితుడిని గుర్తించింది.ఈ విజయం వెనుక ఉన్న పోలీస్ బృందాన్ని,శింగనమల సీఐ కౌలుట్లయ్య,ఎస్సై సాగర్ నేతృత్వంలో సాగిన దర్యాప్తుకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధికారులు పూర్తి వివరాలు వెల్లడించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ప్రతి వ్యాపార సంస్థ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.జిల్లా ఎస్పీ జగదీష్,రూరల్ డీఎస్పీ వెంకటేశులు పోలీస్ బృందాన్ని అభినందించారు.

# పాలసీతో ప్రాణం

**నూతన మైనింగ్ విధానంతో గ్రానైట్ పరిశ్రమకు పునరుజ్జీవం**

**50శాతం అదనంగా వసూలు చేస్తున్న కన్సిడరేషన్ అమౌంట్ రద్దు**

**రెన్యువల్స్ ప్రీమియం సగానికి తగ్గింపు**

**నూతన లీజుల కాలపరిమితి పెంపు, ఆక్షన్ విధానానికి స్వస్తి**

**పాతకేసుల పరిష్కారానికి ఓటీఎస్.. జరిమానాలు భారీగా తగ్గింపు**

**కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా రాయల్టీ వసూలు**

**నూతన పాలసీకి కేబినెట్ ఆమోదం**

**హర్షం వ్యక్తంచేసిన పరిశ్రమ వర్గాలు**

ఎన్నికల నాటి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్న గ్రానైట్ పరిశ్రమను గాడిన పడేలా చేసేందుకు నూతన మైనింగ్ పాలసీని రూపొందించింది. మంగళవారం దానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వం అనుసరించిన అస్తవ్యస్త విధానాలతో పరిశ్రమ పూర్తిస్థాయిలో దెబ్బతింది. ఈ పరిస్థితులను సరిదిద్ది పరిశ్రమకు ఊతం ఇచ్చేలా నిర్ణయాలు తీసుకోవాలని పాదయాత్ర సమయంలో లోకేష్‌కు గ్రానైట్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కచ్చితంగా పరిశ్రమను కాపాడతామని ఆయన హామీ ఇచ్చారు. దాని కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్న పరిశ్రమ వర్గాలు నూతన పాలసీతో ఊపిరిపీల్చుకున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. చీమకుర్తి, ఏప్రిల్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదించిన నూతన పాలసీతో కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న గ్రానైట్ పరిశ్రమకు ప్రాణం పోసినట్లైంది. అందులో ఊరటనిచ్చే అంశాలే ఎక్కువగా ఉన్నాయి. అదేవిధంగా కాసిన్ని చేదు గుళికలు సైతం చోటుచేసుకున్నాయి. మొత్తం మీద గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విధానం వలన అనేక పరిశ్రమలు మూతపడగా, ప్రస్తుత సర్కారు నూతన పాలసీ ఊరటనిచ్చింది. ఉద్యోగ అవకాశాలను పెంపొందించడమే కాక ప్రభుత్వంపై నమ్మకం పెంపొందించేలా, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరే విధంగా ఉంది.

## మైనింగ్ పాలసీలో ప్రధానాంశాలు ఇవీ..

2021లో కొవిడ్ అనంతరం గ్రానైట్ ఖనిజంపై అప్పటికే పెంచిన రాయల్టీకి అదనంగా 50శాతం కన్సిడరేషన్ అమౌంట్‌ను వసూలు చేయాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కొవిడ్ వలన కుప్పకూలిపోయిన పరిశ్రమకు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు అయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దాన్ని పూర్తిగా రద్దుచేసింది. - సీనరేజీ ఫీజును సవరిస్తూ భారం లేకుండా రూపొందించారు. టన్నేజీ ఆధారిత ఒకే విధమైన సీనరేజీ ఫీజు ప్రవేశపెట్టారు. ఇటీవల కాలంలో చైనాకు ఎగుమతులు చేసే గెలాక్సీ బ్లాకులను టన్నేజీ ఆధారంగా కొనుగోలుకు బయ్యర్లు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకూ క్యూబిక్ మీటర్లలో జరుగుతుండటం ఎగుమతులకు ఇబ్బందిగా మారింది. ఇప్పుడు టన్నేజీ విధానం వలన ఎగుమతుల ప్రక్రియ సులభతరం అవుతుంది. - గత వైసీపీ ప్రభుత్వం మైనింగ్ లీజుల మంజూరు ప్రక్రియను మార్చివేసింది. అప్పటివరకు అమలులో ఉన్న ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానాన్ని రద్దుచేసి వేలం ద్వారా లీజుల మంజూరును 2022లో ప్రవేశపెట్టింది. తమకు అనుకూలంగా ఉన్న వారికి లీజులు మంజూరు చేసే దొడ్డిదారి ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీని వలన 6వేలకుపైగా దరఖాస్తులు అర్హత కోల్పోయాయి. ఇపుడు నూతన పాలసీలో ఆక్షన్ పద్ధతిని రద్దు చేసి పాతపద్ధతినే పునరుద్ధరించనున్నారు. - రెన్యువెల్స్‌కి కూడా వసూలు చేస్తున్న ప్రీమియం 10రెట్ల వార్షిక డెట్ రెంట్ నుంచి 5 రెట్లకు తగ్గించారు. ఇది రెండు దశలలో చెల్లించే వెసులుబాటును కల్పించారు. పూర్తి ప్రీమియం చెల్లించిన తేదీ లేదా దరఖాస్తు సమయానికి సంబంధం లేకుండా అన్ని రెన్యువల్ దరఖాస్తులు ఆరునెలలు పాటు పరిగణిస్తారు. అపుడు తగ్గించిన ప్రీమియంతో వాటిని సమర్పించవచ్చు ఎడెట్‌రెంట్లను ఖనిజ ప్రాతిపదికన తిరిగి సవరించారు. ఇప్పటి వరకూ ప్రతికూలంగా ఉండే త్రైమాసిక సెటిల్‌మెంట్‌కు బదులుగా వార్షిక సెటిల్ చేయగలిగే విధంగా మార్చారు. దీనివలన లీజుదారులు తమ నిధులను సమర్థవంతంగా వినియోగించగలుగుతారు. -కొత్త లీజులు, రెన్యూవల్స్‌కు గరిష్ఠ కాలపరిమితిని పెంచారు. గ్రానైట్‌కు కొత్త లీజుకు 20ఏళ్ల నుంచి 30 ఏళ్లకు, రెన్యూవల్స్‌కు 10 నుంచి 20ఏళ్లకు పెంచారు. పూర్తి ప్రీమియం చెల్లించి గతంలో మంజూరైన రెన్యువల్స్ కూడా ఇపుడు ఈ కొత్త కాలపరిమితికి అనుగుణంగా సర్దుబాటు చేయటం ఓనర్లకు కలిసి వచ్చే అంశంగా ఉంది -గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పాత కేసుల పరిష్కారానికి వన్‌టైం సెటిల్‌మెంట్‌ని తీసుకురానున్నారు. ఒక సంవత్సర కాలపరిమితితో ఓటీఎస్‌ను ప్రవేశపెట్టారు. -జరిమానాలు కూడా భారీగా తగ్గించారు. పదిరెట్ల సీనరెజి ఫీజు నుంచి రెండు రెట్లు, ఐదు రెట్లు నుంచి ఒక రెట్టుకు తగ్గించారు. దీనివలన మూసివేసిన గనులను మళ్లీ ప్రారంభించే అవకాశం ఉంటుంది. కేసుల భారం తగ్గుతుంది. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సులభంగా వసూలు అవటం ద్వారా ఇటు ప్రభుత్వానికి సైతం లాభదాయకంగా ఉంటుంది. -డంపింగ్ రాళ్లను అధికారికంగా విక్రయించేందుకు నూతన పాలసీ వెసులుబాటు కల్పించింది. రోడ్ మెటల్‌కు నామినల్‌గా వసూలు చేసే ఫీజును చెల్లించి విక్రయించుకోవచ్చు. దీని వలన అక్రమంగా తరలుతున్న డంపింగ్ రాళ్లకు చెక్ పడటమే కాక ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. ఓనర్లకు ప్రయోజనకరంగా ఉంటుంది. వ్యర్థాల డంపింగ్ కోసం అదనంగా భూమిని పొందే వెసులుబాటును కల్పించారు. అయితే దీనికిగాను మూడు రెట్ల డెట్ రెంట్‌ని వసూలు చేస్తారు. -కుటుంబ సభ్యులకు లీజు బదిలీపై ఫీజు మినహాయింపునిచ్చారు. తండ్రి, తల్లి, కొడుకు, కుమార్తె వంటి ప్రత్యక్ష కుటుంబ సభ్యులకు లీజులను సులభంగా బదిలీ చేసుకోవచ్చు సీనరేజి వసూలు చేసే ప్రక్రియను మార్పుచేశారు. రాష్ట్రం అంతా ఒకేవిధంగా వసూలు బాధ్యతను కాంట్రాక్ట్ ఏజెన్సీకి అప్పజెప్పనున్నారు. దీనివలన ప్రభుత్వ ఖజానాకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది.

**-లీజు జీవితచక్రం మొత్తం డిజిటల్ పోర్టల్ ద్వారా నిర్వహిస్తారు.**

**లీజుదారులకు స్టార్ రేటింగ్‌ని నిర్ణయిస్తారు.**





-తమకు మంజూరైన లీజుల్లో ఇప్పటివరకూ జరిపిన తవ్వకాలపై డ్రోన్ల ద్వారా సర్వే నిర్వహించి అనుమతులు మేరకు తవ్వకాలు జరిపారా లేదా? అని నిర్ధారించనున్నారు. పాలసీలో కొత్తగా తీసుకున్న ఈ నిర్ణయం ఓనర్లకు చేదు గుళికలా మారింది. దీనిపై ప్రాక్టికల్‌గా ఎదురయ్యే సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే యోచనలో ఓనర్లు ఉన్నారు. మొదలుపెట్టకుండా ఉన్న లీజు గడువును ఒక సంవత్సరంలో శాస్త్రీయంగా మూసివేయాలి.

# బట్టకాల్చి మీదేసే కట్టుకథలు!




ప్రజాస్వామ్యానికి మీడియా నాలుగో స్తంభం అంటారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు విఫలమైన చోట మీడియా పాత్ర మొదలవుతుంది. ప్రజాస్వామ్య భారతదేశంలో మీడియాది అత్యంత కీలక పాత్ర. 'మీడియాకు లభించే స్వేచ్ఛను బట్టి ఒక దేశం ప్రజాస్వామ్య దేశమా? కాదా?' అని చెప్పేయవచ్చు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా మీడియా మాత్రం ప్రజల పక్షాన నిలబడి గొంతెత్తాలి. నేడు మీడియా తన పాత్రను సమర్థవంతంగా పోషించడం లేదు. 'పెట్టుబడికి కట్టు కథలకు పుట్టిన విషపుత్రికలు' అని శ్రీశ్రీ చెప్పినట్టు కొన్ని మీడియా సంస్థలు వ్యవహరిస్తున్నాయి. పత్రికా విలువలకు కొన్ని పత్రికలు ఎప్పుడో తిలోదకాలిచ్చేశాయి. గిట్టని వారిపై తప్పుడు, విష ప్రచారం చేయడమే నేటి డైనమిక్ జర్నలిజం. అధికార పార్టీయా? ప్రతిపక్షమా? అన్న తేడా లేకుండా నిర్భయంగా ప్రశ్నించాలి. కానీ, ఆ బాధ్యత నుంచి ఆ మీడియా ఎప్పుడో తప్పుకున్నది. ఉన్నవి, లేనివి కల్పించి విష ప్రచారం చేయడమే దమ్మున్న మీడియా అన్నట్టు తయారైంది. నేటి డైనమిక్ జర్నలిజం రూపంలో నడుస్తున్న ట్రెండ్ ఇదే. తెలంగాణలో ఇది మరింత ఎక్కువగా ఉన్నది. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ కంటే ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉన్నది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పరిస్థితి రోజురోజుకు దిగజారుతుంటే, బీఆర్ఎస్ గ్రాఫ్ పెరుగుతూ పోతున్నది. బీఆర్ఎస్‌ను బలహీన పరిచేందుకు కాంగ్రెస్, బీజేపీ ఎన్ని కుట్రలు చేస్తున్నా గులాబీ జెండా పట్టు కోల్పోవడం లేదు. ప్రజల్లోకి చొచ్చుకెళ్లి మరింత పట్టు సాధించింది. బీఆర్ఎస్‌ను ఎలాగైనా బద్నాం చేయాలని లీక్‌డ్ వార్తలతో సీఎం రేవంత్ కుట్రలకు తెరతీశారు. అయితే, అవన్నీ బూమరాంగ్ అయ్యాయి. ఏడాదిన్నర పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారు. మరోవైపు, బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. కాంగ్రెస్‌తో కలిసి నడిచిన కమ్యూనిస్టులు, కోదండరాంరెడ్డి ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. కాంగ్రెస్‌తో కలిసి ఉండటం వల్ల తాము ప్రజలకు దూరమవుతున్నామని ఎర్రజెండా నేతలు చర్చించుకుంటున్నారు. అయితే, ప్రజల్లో ఇవేవీ చర్చకు రాకుండా రేవంత్ అండ్ కంపెనీల మీడియాలు డైవర్షన్ పాలిటిక్స్ మొదలుపెట్టాయి. బలహీనంగా మారిన కాంగ్రెస్‌ను బలంగా ఉన్నట్టు చూపించే ప్రయత్నం చేస్తున్నాయి. కూడబలుక్కొని వార్తలు రాస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షం పనైపోయిందని వార్త లు వండి వారుస్తున్నాయి. ఒకరేమో బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనమవుతుందని వార్తలు రాస్తే, మరొకరేమో కాషాయ పార్టీలో గులాబీ పార్టీ విలీనం కాబోతున్నదని, ముహూర్తం కూడా ఖరారైనట్టు రాస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఏ పార్టీలోనైనా బీఆర్ఎస్ ఎందుకు విలీనం అవుతుంది? అధికార పార్టీ ఎంపీలే బీఆర్ఎస్ బలంగా ఉందని చెప్తున్నప్పుడు వారు కాంగ్రెస్‌లోకి ఎలా వస్తారు? ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన వారు తలలు పట్టుకుంటున్నారు. దీనికితోడు సొంత పార్టీలోనే ముసలం మొదలైంది. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య పొసగడం లేదు. ఎమ్మెల్యేలు సొంత కుంపట్లు పెట్టుకుంటున్నారు. అన్ని కాంట్రాక్టులు ఒక్క మంత్రికే కట్టబెడుతున్నారని తిరగబడుతున్నారు. అధికార పార్టీలో ఇంత గందరగోళంగా ఉంటే కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ఇష్టపడతారు. కానీ, మీడియా మాత్రం బీఆర్ఎస్‌పై లేనిపోని కల్పిత వార్తలు రాస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నది. విచారణలు, కేసులు అంటూ బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసినా ఆ పార్టీ తలొగ్గడం లేదు. బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌ను, నేతలను గందరగోళానికి గురిచేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అండ్ భజన మీడియా గులాబీ శ్రేణులపై మానసిక యుద్ధానికి తెరతీసింది. సీఎంవో నుంచి వచ్చే వార్తలకు మసాలా దట్టించి బీఆర్ఎస్ కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నారు. గతంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇలాంటి ప్రచారమే చేశారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడటం, గ్రామీణ తెలంగాణలో బీఆర్ఎస్ బలపడటంతో మరోసారి ఇలాంటి చిల్లర రాజకీయాలకు తెర తీశారు. ఇలాంటి రాతల ట్రాప్‌లో ప్రజలు పడతారనుకోవడం భ్రమే.

# నీటి నిర్వాకం




స్వరాష్ట్రం సిద్ధించడానికి ముందున్న పరిస్థితులు మళ్లీ దాపురించాయి. నిరుడు వానలు బాగా కురిసినా జలాశయాల్లో మాత్రం నీళ్లు లేవు. గొంతెండిన పొలాలు కోతకు బదులు మేకల మేతకు ఆవాసాలుగా మారుతున్నాయి. యాసంగికి ఇబ్బంది లేదు, సాగుకు సరిపడా నీళ్లున్నాయన్నది సర్కారు మాట. మరి పొలాలు ఎందుకు ఎండుతున్నాయంటే సమాధానం లేదు. పంటలు చేతికి అందకపోవడంతో రైతు ఆత్మహత్యలు మళ్లీ పెరిగాయి. నిరుడు కురిసిన వానలతో అక్టోబర్ చివరిదాకా వరద ప్రవాహాలు వస్తూనే ఉన్నాయి. కానీ, వేసవికి ముందే అన్ని జలాశయాలు అడుగంటాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కళకళలాడేలా చేసిన కాళేశ్వరం ఎత్తిపోతల వ్యవస్థను నేటి కాంగ్రెస్ సర్కారు కక్షతో, కావాలనే పడావు పెట్టింది. అందుకే తెలంగాణ సాగునీటికి నేడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సర్కారు చేతకానితనం కేవలం గోదావరి జలాలకే పరిమితం కాలేదు. అటు కృష్ణా జలాలను పొరుగు రాష్ట్రం అడ్డూ అదుపు లేకుండా ఎగరేసుకుపోతుంటే గుడ్లప్పగించి చూస్తున్న అసమర్థ ప్రభుత్వం మనది. రాష్ట్రంలోని 358 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. 316 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ముందటే దాది 72 టీఎంసీలు సముద్రంలో కలవగా, ఈ సారి 844 టీఎంసీల జలాలు సముద్రంలో కలిశాయంటే వరదలు ఎంత వచ్చాయో అర్థం చేసుకోవచ్చు. 2024, అక్టోబర్ 25 నాటికి శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ మట్టానికి చేరుకోగా, 215 టీఎంసీల నీటితో కళకళలాడింది. కానీ, ప్రస్తుతం 74.81 టీఎంసీలకు చేరుకొని అడుగంటింది. యాసంగి మొదట్లోనే శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో నీటి నిల్వలు ఖాళీ అయ్యాయి. నీటి నిర్వహణలో సర్కారు దారుణ వైఫల్యానికి ఎండిన పొలాలే మూగసాక్షులు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ సోయి ఉన్నట్టు కనిపించడం లేదు. కాళేశ్వరం జలాలు రాకపోవడంతో భూగర్భ నీటిమట్టాలు అట్టడుగుకు చేరుకుంటున్నాయి. వాస్తవ పరిస్థితి కండ్ల ముందు కనబడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో ఇంకా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుండటం దురదృష్టకరం. కాళేశ్వరం జలాలతో చెక్‌డ్యాములు, చెరువులను క్రమం తప్పకుండా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నింపడం వల్ల భూగర్భ జలాలు ఉబికి వచ్చేవి. దాంతోపాటు 24 గంటల ఉచిత విద్యుత్తుతో బోర్ల ద్వారా రైతులు సేద్యం చేసుకునేవారు. చివరి పొలం వరకు నీరందించాలన్న తపన కేసీఆర్‌లో కనిపించేది. పెద్ద, చిన్న ప్రాజెక్టుల్లో కలిపి తాగునీటి అవసరాలకు పోను డిసెంబర్ నాటికి 354 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక నిర్వహణ కమిటీ లెక్కతేల్చింది. అయితే, ఈ అంచనాలు క్షేత్రస్థాయి పరిస్థితులకు భిన్నంగా ఉన్నాయని ఇంజినీర్లు మొదటినుంచి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ వస్తున్నారు. వీటి గురించిన సరైన అవగాహన లేని ప్రభుత్వం తూతూ మంత్రంగా ప్రణాళికలు రూపొందించి చేతులు దులుపుకొన్నది. పర్యవసానంగా రాష్ట్రంలో ఎటుచూసినా ఎండిన పంటలు, బీడువారిన పొలాలే కనిపిస్తున్నాయి.

# ఇంధనం లేకుండానే అంతరిక్ష ప్రయాణం!

## నూతన 'శక్తి' ఆవిష్కరణ?

## నాసా శాస్త్రవేత్త వెల్లడి



### అదే నిజమైతే న్యూటన్ సూత్రానికి మార్పులు


నాసా శాస్త్రవేత్తలు అంతరిక్ష పరిశోధనల్లో గేమ్‌ఛేంజర్ లాంటి ఆవిష్కరణ చేశారు. ఇంధనం లేకుండానే అంతరిక్షంలో ప్రయాణించేందుకు వీలుగా నూతన 'శక్తి'ని కనుగొన్నట్టు, విద్యుత్తు క్షేత్రాలను వినియోగించడం ద్వారా ఇంధనం లేకపోయినా రాకెట్లకు కావాల్సిన థ్రస్ట్‌ను ఇది అందిస్తుందని వెల్లడించారు. ఈ మేరకు నాసాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ చార్లెస్ బుహ్లెర్ తెలిపారు. నాసా నూతన ఆవిష్కరణ భౌతికశాస్త్ర నియమాలకు సవాలు విసురుతున్నది. 'ప్రతిఒక్క చర్యకు అందుకు సమానమైన ప్రతిచర్య ఉంటుంది' అనే న్యూటన్ మూడో సూత్రాన్ని ఇది ఉల్లంఘిస్తున్నది. నాసా చెప్పేది నిజమైతే భౌతికశాస్త్రం పుస్తకాల్లో సూత్రాలను తిరగరాయాల్సి ఉంటుంది. అంతరిక్ష ప్రయోగాల్లో విప్లవాత్మక మార్పులు జరుగుతాయి. ఇంధనం లేకుండానే అంతరిక్ష మిషన్లను చేపట్టవచ్చు. అయితే, ఇది ఎంతవరకు నిజమన్నది తెలియాల్సి ఉన్నది. ప్రయోగ దశలో ఉన్న ఇది వాస్తవరూపం దాలుస్తుందా? లేదా గతంలో చరిత్ర గతిలో కలిసిపోయిన స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్ టెక్నాలజీ 'ఎమ్ డ్రైవ్'లాగా ప్రయోగశాలలో కలగానే మిగిలిపోతుందా?

# మహా శివరాత్రి స్పెషల్


# తెలంగాణలోని ప్రముఖ శైవక్షేత్రాలు ఇవే







కీసరలో




హిందువులకు ముఖ్యమైన పండుగల్లో మహాశివరాత్రి ఒకటి. ప్రతినెలా కృష్ణ చతుర్దశి మాస శివరాత్రి వస్తుండగా.. ఏటా మాఘ బహుళ చతుర్దశిని శివరాత్రి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. శివరాత్రి సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతాయి. ముఖ్యంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, వేయి స్తంభాల గుడి, కొమురవెల్లి మల్లన్న ఆలయం ఇలా ప్రముఖ ఆలయాలకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. శివరాత్రి పర్వదినం రోజున రాత్రి జాగరణలతో పాటు విశేష పూజలు, అభిషేకాలు చేస్తారు. శివరాత్రి సందర్భంగా తెలంగాణలో ఉన్న ప్రముఖ శైవ ఆలయాల గురించి ఓ సారి తెలుసుకుందాం..!

### వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం..

ఈ ప్రముఖ శైవక్షేత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో ఉన్నది. పరమేశ్వరుడు ఇక్కడ రాజరాజేశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. హైదరాబాద్కు దాదాపుగా 150 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఇంద్రుడి బ్రహ్మహత్య పాపాన్ని నివారించిన క్షేత్రంగా పురాణాల్లో ఉన్నది. ఆలయంలో శివరాత్రి వేడుకలు మూడురోజుల పాటు జరుగుతాయి. వేడుకలకు తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారు. మహాశివరాత్రి రోజున భక్తులు ఇక్కడే శివనామస్మరణలు చేస్తూ జాగరణ చేస్తారు.

### కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం..

మల్లికార్జున స్వామి దేవాలయం సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో ఉన్నది. ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉన్నది. దాదాపు 500 సంవత్సరాల కిందట ఇక్కడ మహేశ్వరుడు మల్లన్నగా కొలువుదీరి పూజలు అందుకుంటున్నాడు. ఇక్కడ సంక్రాంతికి జరిగే పట్నాల వేడుకలను చూసేందుకు రెండు కండ్లు సరిపోవు. సంక్రాంతికి ముందు మల్లికార్జున స్వామి కల్యాణం ఎంతో వైభవంగా జరుగుతుంది. సంక్రాంతి నుంచి ఉగాది వరకు ప్రతి ఆది, బుధవారాల్లో జాతర ఉంటుంది.. లక్షలాది మంది భక్తులు తరలివచ్చి బోనాలు సమర్పిస్తుంటారు.

### రామప్ప.. రామలింగేశ్వరస్వామి

రామలింగేశ్వరస్వామి ఆలయంలో ములుగు జిల్లా పాలంపేటలో ఉన్నది. వరంగల్కు 77 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ఆలయాన్ని కాకతీయులు నిర్మించారు. ఇక్కడ శివుడు రామలింగేశ్వరుడిగా భక్తులకు దర్శనమిస్తాడు. స్వామివారిని రుద్రేశ్వరుడిగాను పూజలందుకుంటాడు. అద్భుతమైన శిల్పకళా సంపదకు రామప్ప ఆలయం నిలయం. ఈ ఆలయ నిర్మాణం వరంగల్లోని ప్రసిద్ధ ఘనపూర్ దేవాలయాలన్ని పోలి ఉంటుంది. ఒక్కసారైనా ఆలయాన్ని ప్రతీ ఒక్కరూ దర్శించాల్సిందే. రామప్ప ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందింది.



### కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం..

ఈ క్షేత్రం జయశంకర్భూపాలపల్లిలో ఉన్నది. తెలంగాణవ్యాప్తంగా ఆలయం అందరికీ తెలిసిందే. ఈ క్షేత్రంలోనే యముడికి పరమశివుడు దర్శనమిచ్చాడు. అందుకే ఇక్కడ శివుడు కాళేశ్వరుడిగా, ముక్తేశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. ఇక్కడ రెండు శివలింగాలు కనిపిస్తాయి. మొదట కాళేశ్వరుడిని దర్శించుకున్నాకే.. ముక్తేశ్వరుడిని దర్శిచుకుంటారు. లింగాలకు రెండు రంధ్రాలు కనిపిస్తాయి. వాటిలో నీళ్లు పోస్తే ఒక ధార వెళ్లి గోదావరి నదిలో.. మరొకధార ప్రాణహిత సంగమంలో కలుస్తాయని భక్తుల విశ్వాసం.

### కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం..

### కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం..

### వేయిస్తంభాల గుడి.. హన్మకొండ

వేయిస్తంభాల ఆలయం హన్మకొండలో ఉన్నది. యావత్దేశంలోనే ప్రసిద్ధి. 12వ శతాబ్దంలో కాకతీయ రాజు రుద్రమదేవుడు నిర్మించాడు. ఈ ఆలయం త్రికూటాత్మకంగా ఉంటుంది. ఇందులో శివుడు, విష్ణుమూర్తి, సూర్యభగవానుడు కొలువై ఉన్నారు. కాకతీయుల శిల్పకళా శైలితో అలరారే ఈ త్రికూటాలయంలో నక్షత్రాకార పీఠంపై రుద్రేశ్వరుడు లింగ రూపంలో పూజలందుకుంటున్నాడు. ప్రధానాలయం తూర్పుకు అభిముఖంగా అద్భుతమైన వాస్తుకళతో అలరారుతూ చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నది. ఆలయ ముఖమండపానికి ఉత్తరాభిముఖంగా నందీశ్వరుడి విగ్రహం నల్లరాతితో మలచబడి.. కల్యాణ మండపం, ప్రధాన ఆలయాలకు మధ్య ఠీవీగా దర్శనమిస్తుంది.

### రామలింగేశ్వరుడిగా..

రామలింగేశ్వర స్వామి హైదరాబాద్కు కూతవేటు దూరంలో కీసరలో ఉంటుంది. ఇక్కడ రాముడు పూజ చేసేందుకు ఓ లింగాన్ని వారణాసి నుంచి తీసుకురావాలని హనుమంతుడికి చెబుతాడు. అక్కడికి వెళ్లిన ఆంజనేయుడు అక్కడ 101 లింగాలను చూస్తాడు. ఏది తీసుకురావాలో తెలియక అన్నింటిని తీసుకువస్తాడు. అప్పటికే ఆలస్యం కావడంతో శివుడే ప్రత్యక్షమై రాముడికి లింగాన్ని ప్రసాదించినట్లుగా స్థలపురాణం. తాను తెచ్చిన లింగాలకు పూజించలేదనే అలకతో వాయుపుత్రుడు లింగాలనే విసిరేస్తాడని.. అందుకే కీసరలో ఎక్కడ చూసినా శివలింగాలే కనిపిస్తాయని చెబుతుంటారు.

### ఛాయా సోమేశ్వర ఆలయం..

ఈ ఆలయం నల్లగొండ జిల్లా కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలోని పానగల్లో ఉంది. ఇక్కడ శివుడు సోమేశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. ఈ ఆలయానికి ఎంతో విశిష్టత, ప్రత్యేకత ఉన్నది. శాస్త్రవేత్తలకు సైతం ఈ ఆలయం సవాల్విసురుతున్నది. ఈ ఆలయంలోని శివలింగంపై నిత్యం నీడ ఉండడం ప్రత్యేకత. గర్భాలయంలో ఉన్న శివలింగం వెనుక ఉన్న గోడపై పగలు మొత్తం కనిపించే.. సూర్యరశ్మితో సంబంధం లేని స్తంభాకార నీడ పడడం ఇక్కడ విశేషం. ఆ సమీపంలోనే పచ్చల సోమేశ్వరాలయం ఉంటుంది. నవరత్నాల్లో ఒకటైన పచ్చరాయితో ఈ లింగాన్ని మలిచారు. కాకతీయ సామంతరాజుల కాలంలో ఈ ఆలయాలను తీర్చిదిద్దారు.

### ఐనవోలు మల్లన్న క్షేత్రం..

ఐనవోలు మల్లికార్జున క్షేత్రం వరంగల్జిల్లాలో ఉన్నది. ఈ క్షేత్రాన్ని ఆరో విక్రమాదిత్యుడి మంత్రి అయ్యనదేవుడు క్రీస్తుశకం 1076లో నిర్మించినట్లుగా చరిత్ర చెబుతున్నది. ఈ ఆలయంలో పరమేశ్వరుడు.. లింగరూపంలో కాకుండా భీకరంగా విగ్రహరూపంలో దర్శనమిస్తాడు. ఇక్కడ వార్షిక ఉత్సవాలు ప్రతియేటా శివరాత్రి సందర్భంగా జరుగుతాయి. పాంచాహ్నిక దీక్షతో.. ఐదురోజుల పాటు అయిదు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి. రోజుకో వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహర్తిన్నారు. ప్రతీ మాసశివరాత్రిరోజున మహాన్యాసపూర్వకరుద్రాభిషేకం, శాంతికల్యాణం, రుద్రహోమం నిర్వహిస్తారు.

### జడల రామలింగేశ్వరస్వామి..

ఈ ఆలయం నార్కట్పల్లిమండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో చెర్వుగట్టులో ఉన్నది. ఆ గ్రామానికి తూర్పు వైపున ఒక చెరువు, ఆ చెరువు గట్టున పార్వతీ సమేత మల్లికార్జునస్వామి దేవాలయం ఉంది. ఆలయానికి పశ్చిమాన కొండపై జడల రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. శివలింగంపై జడల మాదిరిగా రేఖలు కనిపిస్తాయి. దాంతో ఈ శివలింగాన్ని పరశురాముడు ప్రతిష్ఠించడం వలన, కొండ దిగువన పార్వతీదేవి కొలువైవున్న కారణంగా ఈ స్వామిని పార్వతీ జడల రామలింగేశ్వరుడిగా పిలుస్తుంటారు. పరశురాముడు ఈ శివలింగాన్ని ప్రతిష్టించినట్లు ప్రతీతి. క్షత్రియ సంహారానంతరం, తన పాప ప్రక్షాళన కోసం పరశురాముడు 108 శివలింగాలను ప్రతిష్టించాడనీ, ఆయన ప్రతిష్టించిన 108 శివలింగాలలో చివరి లింగం జడల రామలింగేశ్వర స్వామిదని స్థలపురాణం. ఏటా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

# అర్ధసత్యం అబద్ధం కంటే భయంకరం



సాంకేతికతతో పోటీపడుతూ ప్రపంచం ముందుకు దూసుకెళ్తున్నది. సమాచారం పంచుకునే పద్ధతులు, వార్తలు తెలుసుకునే మార్గాలు విప్లవాత్మకంగా మారాయి. గతంలో వార్తా పత్రికలు, రేడియో, టెలివిజన్ వంటి మాధ్యమాల ద్వారా వార్తలు పొందేవాళ్లం. వాటికి ఒక నిర్దిష్ట విధానం, బాధ్యత కలిగిన సంపాదకులు ఉండేవారు. అయితే, సోషల్ మీడియా రాకతో ప్రతి ఒక్కరూ వార్తా ప్రసారకులుగా మారారు. ఎవరికి తోచింది వారు రాస్తున్నారు, ఎవరికి నచ్చింది వాళ్లు నమ్ముతున్నారు. నిజం చెప్పులు వేసుకునే లోపు అబద్ధం ప్రపంచమంతా తిరిగి వస్తుందని అంటారు. అదిప్పుడు నిజమైంది. ఫేక్ న్యూస్ వేగంగా వ్యాపిస్తున్నది. ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలు సమాచారాన్ని ప్రజలకు అత్యంత వేగంగా చేరవేస్తున్నాయి. కానీ, వాటిలో ఎంతమేరకు నిజం ఉందో చెప్పడం చాలా కష్టం. సామాన్య ప్రజలు తమకు తెలియకుండానే ఈ సమాచార ప్రవాహంలో చిక్కుకొని, ఏది నిజమో, ఏది అబద్ధమో తేల్చుకోలేకపోతున్నారు. ఒకరికి నచ్చిన కథను మరొకరు పంచుకుంటారు, అది వందలమందికి చేరుతున్నది. అందులో ఉన్న వాస్తవాన్ని ఎవరూ ప్రశ్నించడం లేదు. ముఖ్యంగా ఆరోగ్య సమాచారం, రాజకీయ విశ్లేషణలు, ఆర్థిక అంశాలు, కులం, మతం లాంటి భావోద్వేగ అంశాల్లో అసత్య ప్రచారం బాగా పెరిగింది. ఇది కొత్త సమస్య కాదు. మన పురాణాలు, ఇతిహాసాల్లోని ఒకే సంఘటనను విభిన్న కోణాల్లో వివరిస్తారు. ఇటీవలే విడుదలైన సినిమా గురించి సోషల్ మీడియాలో తమకు తోచిన విధంగా కథనాలు సృష్టిస్తున్నారు. 'ఛత్రపతి శివాజీ గొప్ప వీరుడు, శూరుడు' అని ఒక వర్గం వాదిస్తే, 'ఔరంగజేబు గొప్ప, శివాజీ పిరికివాడు' అని మరొక వర్గం వాదన. మరి అసలు గొప్పవాడు ఎవరు? చరిత్రను ఎవరు రాయాలో, ఏ కోణంలో చూడాలో నిర్ణయించే వాళ్లదే ఆధిపత్యం. వాస్తవానికి చరిత్ర అనేది కాలక్రమంలో వక్రీకరించబడుతూ ఉంటుంది. సోషల్ మీడియాలో మెసేజ్‌లు, వీడియోలు, పోస్టులు నిరభ్యంతరంగా షేర్ అవుతున్నాయి. వీటిలో మంచిని పంచే సమాచారం కొంత ఉంటే, అపార్థాలు కలిగించే, ద్వేషాన్ని రగిలించే, అపనిందలను వ్యాప్తి చేసే సమాచారమే ఎక్కువగా ఉంటున్నది. సోషల్ మీడియాలో దృశ్యాలు, ఆడియోలు సులభంగా మార్పు చేయవచ్చు. అలా చేసిన వాటిని నిజమని నమ్మి అమాయకులు మోసపోతున్నారు. ఆరోగ్య రంగంలో ఫేక్ న్యూస్ దారుణ ప్రభావం చూపిస్తున్నది. అవగాహన లేకుండా కొన్ని వదంతులను నమ్మి, తప్పుడు చికిత్సలు అనుసరించి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. కొవిడ్ మహమ్మారి సమయంలో ఈ ధోరణి విపరీతంగా కనిపించింది. అదే విధంగా, ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కూడా తప్పుడు ప్రచారం జరుగుతున్నది. కులం, మతం అనే భావోద్వేగ అంశాల్లో అసత్య ప్రచారం ఘోరంగా విస్తరించింది. చిన్న సందేహాలను భారీ వివాదాలుగా మార్చడం, చీలికలు సృష్టించడం సోషల్ మీడియా వల్ల సులభమైంది. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టే పలు పోస్ట్‌లు, వీడియోలు వ్యాపిస్తున్నాయి. నిజానిజాలు తెలుసుకోకుండా ప్రజలు వీటిని నమ్మి సంఘంలో అశాంతి సృష్టిస్తున్నారు. విమర్శనాత్మక ఆలోచన ఎంతో అవసరం. ఏ వార్తనైనా బాగా పరిశీలించిన తర్వాత మాత్రమే నమ్మాలి. మనకు నమ్మకమైన వనరులు ఉపయోగించి ఆన్‌లైన్ పోస్టులు మాత్రమే కాకుండా, నమ్మకమైన వార్తా సంస్థలు, పరిశోధనాత్మక కథనాలను ప్రామాణికంగా భావించాలి. ప్రస్తుతం అనేక ఫ్యాక్ట్-చెకింగ్ వేదికలు అందుబాటులో ఉన్నాయి. వాటిని ఉపయోగించి సమాచారం నిజానిజాలను నిర్ధారించుకోవచ్చు. సోషల్ మీడియాలో ఏమి పంచాలో, ఏమి పంచకూడదో నిర్ణయించే సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉన్నది. పెద్దలు చెప్పిన మాట గుర్తు చేసుకోవాలి. అర్ధసత్యం అబద్ధం కంటే భయంకరం. టెక్నాలజీ మన జీవన శైలిని సులభతరం చేస్తుంది కానీ, అదే టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించకపోతే అది మనల్ని అధః పాతాళానికి నెడుతుంది. సమాచార విప్లవంలో నిజాన్ని గుర్తించే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. నిజం తెలుసుకునే తపన, అసత్యాన్ని ప్రశ్నించే ధైర్యం ఉండాలి. అప్పుడే మన సమాజం అబద్ధాన్ని అణచివేసే శక్తిని సంతరించుకుంటుంది. నిజమే శాశ్వతం.. అబద్ధం తాత్కాలికం. నిజానిజాలను విచారించే సామర్థ్యాన్ని పెంచుకొని, సమాజాన్ని ఆరోగ్యకరమైన సమాచారం వైపు నడిపించగలిగితేనే సత్యం విజయం సాధిస్తుంది.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com